- aruhi group
www.mahaaprabha.com

# నమస్తే మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

మంగళవారం
30-06-2026


సంపుటి : 01 సంచిక : 99 పేజీలు : 08 వెల : ₹5/- తెలంగాణ , ఆంధ్రప్రదేశ్.

Published From RANGAREDDY TELANGANA.RNI NO : TGTEL/26/A0738 VOLUME 01 ISSUE 99 NAMASTEY MAHAAPRABHA



Mr. NAKKA RAJU
Chairman of Mahaaprabha

## ఫ్రాన్స్‌లో భానుడి భగభగ



- వెయ్యి మందికిపైగా బలి
- విలవిల్లాడుతున్న జనజీవనం
- వృద్ధులే లక్ష్యంగా వడగాల్పుల దాడి
- కిక్కిరిసిన ఆస్పత్రులు, శ్మశానవాటికలు:
- అత్యంత దారుణంగా సైప్రస్ పరిస్థితి

3

## అఫ్ఘానిస్థాన్‌పై పాక్ భీకర దాడి




- చిన్నారులు సహా 35 మంది మృతి
- సహాయక సిబ్బందిని లక్ష్యంగా చేసుకున్న పాక్ సైన్యం
- ప్రతీకార దాడులంటూ పాకిస్థాన్ వాదన
- పిరికిపంద చర్యగా అభివర్ణించిన జబిహుల్లా ముజాహిద్
- అంతర్జాతీయ శాంతిదూతగా నటిస్తూ పొరుగు దేశంపై దాడులు
- పాకిస్థాన్ ద్వంద్వ వైఖరిపై విమర్శలు

3



## దేశం గర్వించే రాజధాని నగరంగా అమరావతి

- హైదరాబాద్ ప్లస్‌గా అమరావతి నిర్మాణం జరగాలి
- రాజధాని నిర్మాణ పనుల్లో మరింత వేగం పెంచాలి
- ప్రారంభానికి ప్రధాని మోడీకి ఆహ్వానం
- నిర్మాణ సంస్థలతో సీఎం చంద్రబాబు సమీక్ష

**అమరావతి, 29జూన్ (మహాప్రభ )**

యావత్ దేశం గర్వించే రాజధాని నగరంగా అమరావతిని నిర్మిస్తున్నామని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. హైదరాబాద్ ప్లస్‌గా అమరావతి నిర్మాణం జరగాలని అన్నారు. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ నగర నిర్మాణంలో కాంట్రాక్టు సంస్థలు కూడా భాగస్వాములు కావాలని సీఎం పిలుపునిచ్చారు. రాజధాని నిర్మాణ పనుల్లో మరింత వేగం పెంచాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. అమరావతిలో నిర్మాణ పనుల పురోగతిపై సచివాలయంలో కాంట్రాక్టు సంస్థలతో సీఎం సమీక్ష నిర్వహించారు. నిర్దేశిత గడువు కంటే ముందే నిర్మాణ పనులు పూర్తి చేయాలని సూచనలు ఇచ్చారు. ప్రస్తుతం రూ.50,999 కోట్ల విలువైన పనులు కాంట్రాక్టు సంస్థలకు అప్పగించామని అధికారులు వివరించారు. హౌసింగ్, ట్రంక్ ఇన్ ఫ్రా, ఎల్పీఎస్ ఇన్ ఫ్రా, సహా అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయ టవర్ల లాంటి ఐకానిక్ భవనాల నిర్మాణ ప్రాజెక్టులు వేగంగా

-మిగతా 3 లో

## రైతు ఆశీర్వాద సభ
# వాయిదా

### వాతావరణ పరిస్థితుల దృష్ట్యా నిర్ణయం

- వాయిదా పడినా ఆగని 'రైతు భరోసా'
- మంగళవారం నుంచి నిధుల విడుదల
- తొమ్మిది రోజుల్లో రూ.9 వేల కోట్లు: రైతుల ఖాతాల్లోకి జమ
- జులై 6, 7 లేదా 8న ముగింపు వేడుకలు నిర్వహించేందుకు సన్నాహాలు
- సభా ప్రాంగణంలో బురద కారణంగా మార్పు
- రుణమాఫీ, రైతు భరోసాపై విపక్షాల అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టిన మంత్రి తుమ్మల

**ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి 29జూన్ (మహాప్రభ )**

ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం చేపడుతున్న రైతు సంక్షేమ, ప్రజా కార్యక్రమాలను మెచ్చి వరుణుడు కరుణించాడని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. వర్షాల నేపథ్యంలో సీఎం ఖమ్మం పర్యటన వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. రైతు భరోసా పంపిణీ అనంతరం రైతు ఆశీర్వాద సభ ఉంటుందన్నారు. చింతకాని మండలం జగన్నాథపురంలో రైతు ఆశీర్వాద సభా ప్రాంగణాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌తో కలిసి డిప్యూటీ సీఎం సోమవారం పరిశీలించారు. అనంతరం ఏర్పాటు

-మిగతా 3 లో





## పరస్పర దాడులు నిలిపివేత

- అంగీకారానికి వచ్చిన ఇరాన్, అమెరికా
- హార్ముజ్‌పై నేడు దోహాలో సంప్రదింపులు

3



## జులై 4న ఖమేనీ అంత్యక్రియలు

- హాజరు కానున్న కేంద్రమంత్రి


3



3

## 2028 నుంచి పెట్రోల్ బైకుల రిజిస్ట్రేషన్ బంద్

- రూ.30 లక్షల లోపు ఈ-కార్లకు పన్ను రాయితీ
- విద్యుత్తు వాహనాల పాలసీకి ఢిల్లీ సర్కార్ ఆమోదం



## వాహనదారులకు ఊరట

- సాధారణ స్థితికి చేరిన ఇంధన సరఫరా:
- మళ్లీ అందుబాటులోకి పూర్తిస్థాయి ఇంధనం
- ఇరాన్-అమెరికా చర్చలతో మెరుగుపడిన పరిస్థితి
- ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్‌పై తొలగిన ఆంక్షలు:

3

**జూలై 1 ను పెట్రోల్, డీజిల్ ఆంక్షల ఎత్తివేత**

## హరీష్ రావుకు మెంటల్
# బ్యాలెన్స్ తప్పింది



### ప్రజలు ఐదేళ్లకు తీర్పునిచ్చారు... ఎందుకు అసెంబ్లీని రద్దు చేయాలి

- ప్రతి ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు ప్రజలు శిక్ష వేస్తూనే ఉన్నారు
- బిజేపీది ఆశకాదు.. అత్యాశ
- రైతు భరోసా నిధులు వారంరోజుల్లో జమ చేస్తాం
- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్ 29జూన్ (మహాప్రభ )**

బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి హరీష్‌రావు మాట్లాడుతున్న తీరుచూస్తుంటే ఆయనకు మెంటల్ బ్యాలెన్స్ తప్పిందనే అనుమానం కలుగుతోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. సోమవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో తనను కలిసిన మీడియా ప్రతినిధులతో మంత్రి మాట్లాడుతూ దమ్ముంటే అసెంబ్లీని రద్దు చేయాలన్న హరీష్ రావు

-మిగతా 3 లో



## ప్రపంచ దేశాలు అతలాకుతలం

- 17 ఏండ్లలో అత్యంత బలహీన నైరుతి ఆరంభమిదే
- సాధారణం కంటే 42% తక్కువగా జూన్ వర్షపాతం
- 166 ప్రధాన రిజర్వాయర్లలో 25 శాతమే నీటి నిల్వ!
- వేడెక్కుతున్న అట్లాంటిక్.. పసిఫిక్‌లో ఎల్‌నినో
- ఐరోపా, ఉత్తర అమెరికాలో అధిక ఉష్ణోగ్రతలు
- వర్షాభావంతో భారత ఉప ఖండంలో కరువు!

**న్యూఢిల్లీ, 29జూన్ (మహాప్రభ )**

రెండు మహాసముద్రాలు పలు ప్రపంచ దేశాల్లో కోట్ల మందిని అతలాకుతలం చేస్తున్నాయి. ఒకటి అట్లాంటిక్ మహా సముద్రం కాగా, రెండోది పసిఫిక్ మహాసముద్రం. కొన్ని వేల కిలోమీటర్ల దూరం ఉన్న ఈ రెండు మహాసముద్రాలు వాతావరణంలో మార్పులకు కారణమవుతున్నాయి. వేడెక్కుతున్న అట్లాంటిక్ మహాసముద్రం కారణంగా ఐరోపా, ఉత్తర అమెరికా ఖండాల్లో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదవుతన్నాయి. మరోవైపు పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడుతున్న ఎల్ నినో కారణంగా భారతదేశంలో

-మిగతా 3 లో



## ఉద్యోగులకు తీపికబురు

- మరో రూ.2 వేల కోట్ల బకాయిలు విడుదల
- ఉప ముఖ్యమంత్రి ఆదేశాలతో నిధులు విడుదల
- ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**హైదరాబాద్ 29జూన్ (మహాప్రభ )**

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పట్ల ఉన్న చిత్తశుద్ధిని రాష్ట్ర ప్రభుత్వం మరోసారి చాటుకుంది. ఉద్యోగులకు తీపికబురు అందించింది. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ఉద్యోగులకు ఇచ్చిన హామీని నెరవేర్చింది. బకాయిల చెల్లింపు ప్రక్రియను వేగవంతం చేసింది. ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా అడుగులు వేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కల ఆదేశాల మేరకు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా సోమవారం రూ.రెండు వేల కోట్ల నిధులను విడుదల చేశారు. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ఉద్యోగులు,

-మిగతా 3 లో

# ఉలిక్కిపడిన బెంగళూరు

### ఒకే రోజు మూడు హత్యలు..

**న్యూఢిల్లీ 29జూన్ (మహాప్రభ )**
ఒకే రోజు మూడు హత్యలు జరిగాయి. వేర్వేరుగా జరిగిన ఈ సంఘటనల్లో ఇద్దరు మహిళలు హత్యకు గురికాగా, ఒక నేరస్తుడ్ని పత్యర్థులు నరికి చంపారు. ఈ మూడు హత్యలతో రాజధాని నగరం ఉలిక్కిపడింది. కర్ణాటక రాజధాని బెంగళూరులో ఈ మూడు సంఘటనలు జరిగాయి. ఆదివారం మహాలక్ష్మి లేఅవుట్‌లో మొదటి హత్య జరిగింది. పెళ్లి విషయంలో గొడవ కారణంగా 23 ఏళ్ల అంజలిని ఆమె ప్రియుడు రాజీవ్, కత్తితో పొడిచి హత్య చేశాడు. వీరిద్దరూ మూడేళ్లకు పైగా ప్రేమలో ఉన్నారని పోలీసులు తెలిపారు. అయితే రాజీవ్ నేర చరిత్ర కారణంగా ఆ యువతి కుటుంబం వారి సంబంధాన్ని



వ్యతిరేకించినట్లు తెలిసిందన్నారు. నిందితుడ్ని అరెస్ట్ చేసినట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.కాగా, అదే రోజున కొన్ని గంటల్లోనే బొమ్మనహల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మునియప్ప లేఅవుట్‌లో మరో మహిళ హత్యకు గురైంది. అద్దె ఇంట్లో నివసిస్తున్న 40 కృష్ణ బర్మన్ గొంతు నులిమి చంపి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఆమె హత్యపై దర్యాప్తు చేస్తున్నారు. ఆ మహిళ ఇటీవల ఎవరితో మాట్లాడింది? ఆమె కదలికలు, ఇతర వివరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. మరోవైపు ఆదివారం సాయంత్రం జేపీ నగర్ రోడ్డులోని ఐజీ సర్కిల్ సమీపంలో బహిరంగంగా మూడో హత్య జరిగింది. హత్య, హత్యాయత్నం, దోపిడీతో సహా పలు క్రిమినల్ కేసులున్న నేరస్థుడు రాజా అలియాస్ హల్క్ రాజాను కారులో వచ్చిన దుండగులు వెంబడించారు. కత్తులు, కొడవళ్లతో దాడి చేసి నరికి చంపారు. పాత కక్షలు, ప్రతీకార చర్యగా ప్రత్యర్థులు అతడ్ని హత్య చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే ఒకే రోజు మూడు హత్యలు జరుగడంతో బెంగళూరు వాసులు ఉలిక్కిపడ్డారు. రాజధాని నగరంలో శాంతిభద్రతలపై ఆందోళన చెందుతున్నారు.

## అమెరికా, ఇరాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలు..

**డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన**



**న్యూఢిల్లీ 29జూన్ (మహాప్రభ )**
అమెరికా, ఇరాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు మరోసారి పెరుగుతున్నాయి. ఈ తరుణంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. తాజా అంశాలపై చర్చించేందుకు రావాలని ఇరాన్ కోరిందన్నారు. టెహ్రాన్ అభ్యర్థన మేరకు ఖతార్ రాజధాని దోహా వేదిగా మంగళవారం సమావేశం ఉంటుందని సోషల్ మీడియాలో ఆయన పోస్టు చేశారు. ఇరుదేశాల ప్రతినిధులు ఇందులో పాల్గొంటారని చెప్పారు.ఈ సమావేశంలో తుది ఒప్పందంపైనా చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కాగా ఖతార్‌లో ఈ వారం ఇరాన్, అమెరికా బృందాల మధ్య సమావేశాలు నిర్వహించే ప్రణాళికలేవీ లేవని ఇరాన్ ఉప విదేశాంగ మంత్రి కాజెమ్ ఘరిబబాడి పేర్కొన్నారు. తమ హామీల అమలుకు సంబంధించి అమెరికా తీసుకుంటున్న చర్యల పర్యవేక్షణ, ఖతార్‌తో సంప్రదింపులు యథావిధిగా కొనసాగుతున్నాయని అన్నారు. అయితే దోహాలో మంగళవారం ఇరుదేశాల ప్రతినిధుల మధ్య చర్చలు జరగనున్నట్లు వస్తున్న వార్తలను తాము ధ్రువీకరించలేమని తెలిపారు. పరిస్థితులు చక్కబడిన తర్వాతే చర్చలు జరుగుతాయని స్పష్టంచేశారు.

## రాజ్యసభలో ప్రతిపక్ష నేతగా ఖర్గే..

**-తిరిగి ఎన్నికైన నేపథ్యంలో ఆ మేరకు గుర్తింపు**

**న్యూఢిల్లీ 29జూన్ (మహాప్రభ )**




కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను రాజ్యసభలో ప్రతిపక్ష నేతగా సోమవారం తిరిగి గుర్తించారు. రాజ్యసభకు మరోసారి ఎన్నికైన నేపథ్యంలో ప్రతిపక్ష నాయకుడిగా ఆయన తిరిగి నియమితులయ్యారు. జూన్ 25తో రాజ్యసభ సభ్యుడిగా మల్లికార్జున ఖర్గే పదవీకాలం ముగిసింది. దీంతో జూన్ 26 నుంచి రాజ్యసభలో ప్రతిపక్ష నేతగా ఆయన కొనసాగలేదుకాగా, కాంగ్రెస్ అధ్యక్షుడైన మల్లికార్జున ఖర్గే మరోసారి రాజ్యసభకు ఎన్నికయ్యారు. దీంతో సోమవారం రాజ్యసభ చైర్మన్ కార్యాలయంలో సభ్యుడిగా ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. ఈ నేపథ్యంలో రాజ్యసభలో ప్రతిపక్ష నేతగా మల్లికార్జున ఖర్గేను మరోసారి గుర్తించారు. మరోవైపు రాజ్యసభ సెక్రటరీ జనరల్ పీసీ మోదీ ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన జారీ చేశారు. 'రాజ్యసభకు తిరిగి ఎన్నికైనందున, పార్లమెంటులో ప్రతిపక్ష నాయకుల జీతభత్యాల చట్టం, సంబంధిత నిబంధనల ప్రకారం జూన్ 26 నుంచి అన్ని ప్రయోజనాలు అమలులోకి వచ్చేలా మల్లికార్జున ఖర్గేను రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడిగా రాజ్యసభ చైర్మన్ గుర్తించారు' అని పేర్కొన్నారు.

## జర్మనీలో మాస్ షూటింగ్..

**-ఐదుగురి మృత్యువాత..!**

**29జూన్ (మహాప్రభ )**



జర్మనీలో కాల్పులు కలకలం సృష్టించాయి. ఉత్తర జర్మనీలోని స్టేడ్ పట్టణంలో సోమవారం జరిగిన మాస్ షూటింగ్ లో ఐదుగురు మరణించారు. కాల్పుల ఘటనతో అప్రమత్తమైన పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. కాల్పులతో సంబంధమున్న ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. మాస్ షూటింగ్‌కు కారణాలపై ఈ ఇద్దరిని పోలీసులు విచారిస్తున్నారు.స్టేడ్ పట్టణంలోని యువ కేంద్రం సమీపంలో దుండగులు కాల్పులకు తెగబడ్డారు. సిటీ మధ్యలో ఉండే ఈ ప్రాంతంలో ఈమధ్య పెద్ద సంఖ్యలో కార్యకలాపాలు సాగుతున్నాయి. దాంతో, తుపాకులతో వచ్చిన కొందరు అక్కడి వారిపై కాల్పులు జరిపారు. ఒక్కసారిగా కాల్పుల మోతతో జనాలు భయభ్రాంతులకు లోనయ్యారు. బుల్లెట్ గాయాలతో ఐదుగురు చనిపోయారని ఏజెన్సీ ఫ్రాన్స్ ప్రెస్ (ఏఎఫ్‌పీఈ) వార్త సంస్థతో ఓ పోలీసు అధికారి చెప్పారు. సమాచారం అందగానే అక్కడి వెళ్లిన పోలీసులు.. ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారని ఆయన తెలిపారు. ఈ ప్రాంతాన్ని వెంటనే ఖాళీ చేయండి. మీ ప్రాణాలు కాపాడుకోండి అని అక్కడి వారిని ఆదేశించినట్టు పోలీస్ అధికారి వెల్లడించారు.

## ఉత్తర జర్మనీలో కాల్పులు కలకలం


**ముంబై: 29జూన్ (మహాప్రభ )**



ఉత్తర జర్మనీలో కాల్పులు కలకలం సృష్టించాయి. స్టేడ్ పట్టణంలోని యువ కేంద్రం సమీపంలో దుండగులు కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో ఐదుగురు మరణించారు. కాల్పుల ఘటనతో అప్రమత్తమైన పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. కాల్పులతో సంబంధమున్న ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు.సిటీ మధ్యలో రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో తుపాకులతో వచ్చిన కొందరు అక్కడి వారిపై కాల్పులు జరిపారు. ఒక్కసారిగా కాల్పుల మోతతో జనాలు భయభ్రాంతులకు లోనయ్యారు.బుల్లెట్ గాయాలతో ఐదుగురు చనిపోయారని ఏజెన్సీ ఫ్రాన్స్ ప్రెస్ (ఏఎఫ్‌పీఈ) వార్త సంస్థతో ఓ పోలీసు అధికారి చెప్పారు. సమాచారం అందగానే అక్కడి వెళ్లిన పోలీసులు.. ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారని ఆయన తెలిపారు.

## రాష్ట్రంలో అరు నెలల్లోపే అసెంబ్లీ ఎన్నికలు..

**-సిద్ధంగా ఉండాలని డీఎంకే శ్రేణులకు ఎంకే స్టాలిన్ పిలుపు.**



**న్యూఢిల్లీ 29జూన్ (మహాప్రభ )**
తమిళనాడు లో రాజకీయ పరిణామాలు వేగంగా మారే అవకాశం ఉందని డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ అన్నారు. మరో ఐదేళ్లు ఎదురుచూడాల్సిన అవసరం లేదని, మూడు నెలలు లేదా ఆరు నెలల్లో ఎన్నికలు రావొచ్చని పార్టీ శ్రేణులను అప్రమత్తం చేశారు. ఇప్పటి నుంచే ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. చెన్నై లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో మాజీ మంత్రి బెంజమిన్‌తో పాటు పలువురు ఏఐఏడీఎంకే నేతలు, కార్యకర్తలు డీఎంకేలో చేరారు.ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న టీవీకే ప్రభుత్వానికి సొంతంగా మెజారిటీ లేదన్నారు. 118 సీట్ల మెజారిటీ అవసరం కాగా ఆ పార్టీకి 108 స్థానాలే వచ్చాయని గుర్తుచేశారు. ప్రస్తుతం ప్రభుత్వం ఇతర పార్టీల మద్దతుతోనే కొనసాగుతోందన్నారు. ఇటీవల వరకు డీఎంకే కూటమిలో ఉన్న కాంగ్రెస్, వామపక్షాలు, వీసీకే, ఐయూఎంఎల్ మద్దతుతోనే ప్రభుత్వం నడుస్తోందని చెప్పారు. అలాంటి ప్రభుత్వం ఎంతకాలం కొనసాగుతుందో చెప్పలేమన్నారు. ఎప్పుడు కూలిపోతుందో తెలియదని వ్యాఖ్యానించారు. అందుకే పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇప్పటి నుంచే ఎన్నికలకు సిద్ధం కావాలని స్టాలిన్ సూచించారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చిన తర్వాత కాకుండా ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో పని ప్రారంభించాలని కోరారు. డీఎంకేను మళ్లీ అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. టీవీకే ప్రభుత్వంపై కూడా స్టాలిన్ విమర్శలు గుప్పించారు. గత నెల రోజులుగా రాష్ట్రంలో అభివృద్ధి మందగించిందన్నారు. పెట్టుబడిదారులు ఇతర రాష్ట్రాలకు వెళుతున్నారని అన్నారు. మహిళలపై నేరాలు, మాదకద్రవ్యాల కేసులు, దోపిడీలు, పెట్రోల్ బాంబు దాడులు, విద్యుత్ కోతలు పెరిగాయని విమర్శించారు. ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ కూడా ప్రభుత్వంపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఒకప్పుడు తమిళనాడులో ఉన్న సుపరిపాలన ఇప్పుడు కనిపించడం లేదన్నారు. ప్రజలు విద్యుత్, తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం పాలన కంటే ప్రచారంపైనే ఎక్కువ దృష్టి పెడుతోందని విమర్శించారు. అసెంబ్లీ సమావేశాలు సభలా కాకుండా సినిమా షూటింగ్‌లా మారిపోయాయని ఎద్దేవా చేశారు.

## రెండు నూతన గ్రామపంచాయతీ భవనాల నిర్మాణం

**-గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణం,అభివృద్ధి పనులు**
**-తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం,**
**-కొత్త రేషన్ కార్డుల మంజూరు,**
**-ప్రజలకు నాణ్యమైన సన్న బియ్యం పంపిణీ,**
**-ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా వేలాది నిరుపేదకు**









**గాంధారి, జూన్29 (మహాప్రభ)**
ఎల్లారెడ్డి నియోజకవర్గం ఎమ్మెల్యే మదన్ మోహన్, నాయకత్వంలో అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న ఎల్లారెడ్డి నియోజకవర్గం రూ.40 లక్షల వ్యయంతో రెండు నూతన గ్రామపంచాయతీ భవనాలను ప్రారంభించిన ఎమ్మెల్యే మదన్ మోహన్,
ఎల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా గాంధారి మండలంలోని పిస్కల్ గుట్ట తండా, చద్మల్ గ్రామంలో రూ.40 లక్షల పిస్కల్ గుట్ట తండా: రూ.20 లక్షలు, చద్మల్ గ్రామం: రూ.20 లక్షలు వ్యయంతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనాలను ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్, ఘనంగా ప్రారంభించారు.
ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎల్లారెడ్డి నియోజకవర్గంలో, ముఖ్యంగా గాంధారి మండలంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని అన్నారు.
ప్రతి గ్రామాన్ని అభివృద్ధి బాటలో నడిపించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొంటూ...
కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడం,లి వంటి కార్యక్రమాలు ప్రజల జీవితాల్లో గణనీయమైన మార్పు తీసుకొచ్చాయని తెలిపారు. ఇప్పటికే అనేక ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తై, గృహప్రవేశాలు కూడా జరుగుతుండడం ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని అన్నారు.ఓనూతన గ్రామపంచాయతీ భవనం ద్వారా గ్రామ ప్రజలకు పరిపాలనా సేవలు మరింత సులభంగా, వేగంగా అందుబాటులోకి వస్తాయని తెలిపారు. గ్రామాభివృద్ధి పనుల నిర్వహణ, ప్రజా సమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాల అమలులో ఈ భవనం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. గ్రామాలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో ఎమ్మెల్యే చూపుతున్న ప్రత్యేక శ్రద్ధకు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.
గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యే మదన్ మోహన్, పిస్కల్ గుట్ట తండా,చద్మన్ గ్రామ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు సింగసాని శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ పరమేశ్వర్, స్థానిక సర్పంచ్ రేణుక సంజీవ్ యాదవ్, ఏఎంసి వైస్ చైర్మన్ ఆకుల లక్ష్మణ్, సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు గణేష్,ఉప సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు భాస్కర్ గౌడ్, వివిద గ్రామ సర్పంచులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ఆకుల శ్రీనివాస్, శేఖర్, తూర్పు రాజు, లైన్ రమేష్, నీల రవి, వార్డ్ మెంబర్లు, టౌన్ అధ్యక్షుడు సంఘని సాయిబాబా, యూత్ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వసుంధర,యువజన కాంగ్రెస్ అధ్యక్షులు, వివిధ అనుబంధ విభాగాల నాయకులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పాల్గొన్నారు.

## అయోధ్య బార్ అసోసియేషన్ కీలక నిర్ణయం..

### నిందితుల తరపున వాదిస్తే 5 లక్షల ఫైన్

**అయో న్యూఢిల్లీ 29జూన్ (మహాప్రభ )**
అయోధ్య రామాలయంలో విరాళాలను దుర్వినియోగం చేసిన కేసులో 8 మందిని అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అయితే అయోధ్య బార్ అసోసియేషన్ కీలక నిర్ణయం తీసుకున్నది. నిందితుల తరపున కేసును వాదించబోమని లాయర్ల సంఘం తీర్మానించింది. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కాలికా ప్రసాద్ మిశ్రా మాట్లాడుతూ.. నిధుల చోరీ కేసులో నిందితులను తరపున ఎవరూ వాదించరు అని, ఒకవేళ వాదిస్తే వారికి 5 లక్షల జరిమానా విధించనున్నట్లు చెప్పారు. బార్ అసోసియేషన్ మరో నిర్ణయాన్ని కూడా తీసుకున్నది. రామాలయ జనరల్ సెక్రటరీ చంపత్ రాయ్, సభ్యుడు అనిల్ మిశ్రా, గోపాల్ రావు.. తక్షణమే




అయోధ్య విడిచి వెళ్లాలని డిమాండ్ చేసింది.మూడు రోజుల్లోగా అయోధ్య నుంచి వెళ్లిపోకుంటే, అప్పుడు సిటీని బ్లాక్ చేస్తామని, ఎవర్నీ లోపలికి రానివ్వకుండా చేస్తామని మిశ్రా తెలిపారు. అయితే ఈ ముగ్గురిలో ఏ ఒక్కరి పేరు కూడా ఎఫ్ఐఆర్‌లో నమోదు కాకపోవడం గమనార్హం. ఈ కేసులోని 8 మంది నిందితుల్లో అవినాశ్ శుక్లా, అనుకల్ప్ మిశ్రా, లవ్ కుష్ మిశ్రా, మనీశ్ కుమార్ యాదవ్, కరుణేశ్ పాండే, రామ్ శంకర్ మిశ్రా, సుభాష్ శ్రీవాత్సవ, రామశంకర్ ఉన్నారు. నిందితులు అందరూ క్యాష్ కౌంటింగ్, విలువైన వస్తువులను భద్రత పరిచే ఉద్యోగంలో ఉన్నారు. ఈ కేసులో సీబీఐ విచారణ చేపట్టాలని బార్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. సమగ్ర విచారణ కోసం సుప్రీంకోర్టు వరకు వెళ్లనున్నట్లు ప్రసాద్ మిశ్రా తెలిపారు. చంపత్ రాయ్, అనిల్ మిశ్రా ప్రస్తుతం ట్రస్టుకు రాజీనామా చేశారు. దానిపై జూలై 7వ తేదీన నిర్ణయించనున్నారు.

# ఫ్రాన్స్‌లో భానుడి భగభగ

**- వెయ్యి మందికిపైగా బలి**
**-విలవిల్లాడుతున్న జనజీవనం**
**- వృద్ధులే లక్ష్యంగా వడగాల్పుల దాడి**
**- కిక్కిరిసిన ఆస్పత్రులు, శ్మశానవాటికలు:**
**- అత్యంత దారుణంగా సైప్రస్ పరిస్థితి**


పారిస్



యూరోప్‌లో సమ్మర్ సెగ పుట్టిస్తోంది. వేడి తట్టుకోలేక.. జనం విలవిలలాడుతున్నారు. అధిక ఉష్ణోగ్రతల వల్ల ఫ్రాన్స్‌లో మృతుల సంఖ్య భారీగా నమోదు అవుతోంది. సాధారణం కన్నా ఈసారి వెయ్యి మంది అధికంగా ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు చెప్పారు. గడిచిన రెండు దశాబ్దాలతో పోలిస్తే, ఈసారి ఎండ తీవ్రత మరీ ఎక్కువగా నమోదు అయినట్లు తెలుస్తోంది. ఫ్రాన్స్‌లోని అనేక ప్రాంతాల్లో గత కొన్ని రోజులుగా 40 డిగ్రీల కన్నా ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. దీంతో మంగళవారం ఆ దేశంలో అత్యంత వేడి దినంగా నమోదు అయ్యింది. 2003 తర్వాత భారీ స్థాయిలో గరిష్ట ఉష్ణోగ్రతులు నమోదు అవుతున్నాయి.జూన్ 24వ తేదీ నుంచి అధికంగా సుమారు వెయ్యి మందికిపైగా వేడి వల్ల మృతిచెందినట్లు నేషనల్ పబ్లిక్ హెల్త్ ఏజెన్సీ పేర్కొన్నది. అయితే బాధితుల్లో 85 శాతం మంది 65 ఏళ్లు దాటినవారే ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలు చెప్పాయి. ఐలీ డీ ఫ్రాన్స్ ప్రాంతంలో మృతుల సంఖ్య 40 శాతం పెరిగినట్లు తెలిసింది. నార్మాండీ, బ్రిట్టనీ, సెంటర్ వాల్ డీ లోయిరి, పేస్ డీ లా లోయిరి, నోవెల్లె అక్విెయింటిని ప్రాంతాలు కూడా తీవ్ర హీట్‌వేవ్‌కు గురవుతున్నాయి. పారిస్‌లో అనేక ఈవెంట్లను రద్దు చేశారు. వార్షిక ప్రైడ్ మార్చ్ కూడా రద్దు అయ్యింది. ఆస్పత్రులు, శ్మశానవాటికలు కిక్కిరిసిపోతున్నట్లు అధికారులు చెప్పారు. పబ్లిక్ సేవలన్నీ అధిక భారంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. సమ్మర్ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదని విపక్షాలు విమర్శిస్తున్నాయి. ఆదివారం జర్మనీలో 41.7 డిగ్రీలు, చెక్ రిపబ్లిక్‌లో 41.1 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. వేసవి కాలంలో ఈ సారి అనేక యురోప్ దేశాల్లో తీవ్ర నీటి ఎద్దడి ఉన్నట్లు యురోపియన్ యూనియన్ తెలిపింది. సైప్రస్‌లో అత్యధికంగా 92 శాతం నీటి కొరత ఉన్నట్లు పేర్కొన్నది. మాల్టాలో 66 శాతం, టర్కీ.. గ్రీస్, రొమేనియా, పోర్చుగల్ దేశాల్లో 30 శాతంపైనే నీటి సమస్య ఉన్నట్లు తెలుస్తోంది.

# పరస్పర దాడులు నిలిపివేత

**అంగీకారానికి వచ్చిన ఇరాన్, అమెరికా**
**హార్ముజ్‌పై నేడు దోహాలో సంప్రదింపులు**



-- జనరల్ డెస్క్

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు సడలి సాధారణ పరిస్థితులు నెలకొనే అవకాశాలు కన్పిస్తున్నాయి. పరస్పర దాడులను నిలిపివేసేందుకు ఇరాన్, అమెరికా అంగీకరించాయి. హార్మూజ్ జలసంధిపై ఏర్పడిన వివాదాన్ని పరిష్కరించుకోవడానికి తిరిగి సంప్రదింపులు ప్రారంభించాలని నిర్ణయించాయి. దీంతో తాత్కాలిక శాంతి ఒడంబడిక సజీవంగానే ఉంటుందన్న ఆశాభావం వ ?యక్తమవుతోంది. 'ఎంఓయూలోని అన్ని అంశాల పైన సాంకేతిక చర్చలు కొనసాగుతాయి. ఇరు పక్షాలు దాడులకు స్వస్తి చెబుతాయి. హార్ముజ్‌లో నౌకలు స్వేచ్ఛగా ప్రయాణించవచ్చు' అని ఓ అమెరికా అధికారి తెలిపారు. ఈ నెల 17న 14 సూత్రాల అవగాహనా ఒప్పందం (ఎంఓయూ)పై ఇరాన్, అమెరికా సంతకాలు చేసిన విషయం తెలిసిందే. ఈ ఒప్పందం ప్రకారమే హార్ముజ్‌ను వాణిజ్య నౌకల రాకపోకలకు తెరిచారు. కాగా ఇరు పక్షాల మధ్య మంగళవారం ఖతార్‌లో చర్చలు ప్రారంభం అవుతాయని ఆక్సియాస్ వార్తా సంస్థ తెలియజేసింది. జలసంధిలో ప్రయాణిస్తున్న ఓ వాణిజ్య నౌకపై గురువారం ఇరాన్ దాడి జరిపిన నేపథ్యంలో మధ్యప్రాచ్యంలో తిరిగి ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఎంఓయూ కింద కుదుర్చుకున్న కాల్పుల విరమణను ఇరు దేశాలు బేఖాతరు చేసి దాడులు, ప్రతిదాడులకు దిగాయి. ఆదివారం ఉదయం కువైట్, అమెరికా స్థావరాలపై ఇరాన్ సేనలు క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడ్డాయి. యుద్ధాన్ని ముగించేందుకు కుదుర్చుకున్న ఒప్పందాన్ని గౌరవించని పక్షంలో ఇరాన్ అనేదే ఉండదని అంతకుముందు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలు జారీ చేశారు. ఇరు దేశాల మధ్య తాజాగా హింస చోటుచేసుకున్నప్పటికీ ఇరాన్, అమెరికా అధికారులు మాత్రం నేడు దోహాలో సమావేశమవుతారు. ఎంఓయూను సజీవంగా ఉంచేందుకు, మరో సైనిక చర్య జరగకుండా నివారించేందుకు ప్రయత్నిస్తారు.

# జులై 4న ఖమేనీ అంత్యక్రియలు

**హాజరు కానున్న కేంద్రమంత్రి**

న్యూఢిల్లీ,



ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలకు భారత్ తరపున విదేశాంగ శాఖ సహాయమంత్రి పబిత్ర మార్గరీటా హాజరుకానున్నట్టు సమాచారం. మంత్రి పబిత్రతో పాటు బిహార్ గవర్నర్ సయ్యద్ అతా హస్నైన్ కూడా వెళ్లనున్నట్టు తెలుస్తోంది. అయతొల్లా ఖమేనీ అంత్యక్రియలకు రావాలని ప్రధాని మోదీని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ ఇటీవల ఆహ్వానించారు. ఈ నేపథ్యంలో భారత్ తరపున కేంద్ర మంత్రి, బిహార్ గవర్నర్ ఇరాన్‌కు వెళ్లనున్నట్టు తెలుస్తోంది. అయతొల్లా జన్మస్థలమైన మష్హాద్ నగరంలోనే జులై 4న ఆయన అంత్యక్రియలను నిర్వహించనున్నారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్‌లు ఫిబ్రవరి 28న దాడులు ప్రారంభించిన విషయం తెలిసిందే. తొలి రోజు జరిగిన దాడిలోనే ఖమేనీ కన్నుమూశారు. దాదాపు 36 ఏళ్ల పాటు ఆయన ఇరాన్‌ను ముందుండి నడిపించారు. ఖమేనీ స్మృత్యర్థం కోమ్ నగరంలో కూడా ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయని స్థానిక మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఖమేనీ అంత్యక్రియలపై తొలి నుంచీ కొంత సందిగ్ధత నెలకొంది. జూన్‌లో అంత్యక్రియలు పూర్తవుతాయని మొదట్లో వార్తలు వెలువడ్డాయి. అయితే, జులైలో ఈ కార్యక్రమం జరుగుతుందని ప్రభుత్వ మీడియా ఇటీవల ధ్రువీకరించింది. అంత్యక్రియలకు దాదాపు 20 మిలియన్ల మంది హాజరుకానున్నట్టు ఇరాన్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. పాక్ ప్రధాని షహబాజ్ షరీఫ్ కూడా ఇరాన్‌కు వెళ్లే అవకాశం ఉంది. ఇక అయతొల్లా ఖమేనీ అనంతరం ఆయన కుమారుడు మొజ్తాబా ఖమేనీ ప్రస్తుతం ఇరాన్ సుప్రీం లీడర్‌గా ఉన్నారు. అయితే, ఆయన ఎక్కడున్నారనే దానిపై స్పష్టత లేదు. మొజ్తాబా ఆరోగ్యంపై కూడా పలు వార్తలు వెలువడ్డాయి. ఆయన కోమాలో ఉండే అవకాశం ఉందని సీనియర్ యూఎస్ అధికారులు పలుమార్లు తెలిపారు.

# ప్రపంచ దేశాలు అతలాకుతలం

మొదటి తరువాయి

నైరుతి రుతుపవనాలకు అవాంతరం ఏర్పడుతున్నది. దీంతో దేశంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొని ఇటీవలి కాలంలో ఎన్నడూ లేనట్టి కరువు పరిస్థితులకు దారితీస్తున్నది. దీంతో న్యూఢిల్లీ నుంచి న్యూయార్క్ వరకు విస్తరించిన ఈ అసాధారణ వాతావరణ పరిస్థితులకు ఈ రెండు మహాసముద్రాలు కారణమవుతున్నాయి.

**ఉష్ణ గుమ్మటాలు బలపడే చాన్స్**

వేడెక్కుతున్న అట్లాంటిక్ మహాసముద్రం కారణంగా గతంలో ఎన్నడూ లేని విధంగా ఐరోపా ఖండంలో వడగాలులు వీయడమే కాకుండా స్పెయిన్, పోర్చుగల్, ఇటలీ, ఫ్రాన్స్ దేశాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్‌ను దాటుతున్నాయి. ఈ వాతావరణ ధోరణి పశ్చిమ దిశగా విస్తరిస్తున్నదని, దీంతో ఉష్ణ గుమ్మటాలు బలపడి అమెరికాలో సైతం రికార్డుస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశమున్నదని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. నిరంతరం అధిక వాతావరణ పీడనం ఉండే ప్రాంతంలో భూ ఉపరితలం దగ్గర వేడి గాలులను బంధించినప్పుడు ఉష్ణగుమ్మటం ఏర్పడుతుందని వారు వివరించారు. ఆ సమయంలో దిగువకు వీచే గాలి సంకోచించి వేడెక్కుతుందని, అదే సమయంలో ఆకాశం నిర్మలంగా మారడంతో సూర్యరశ్మి నేలను దహించి వేస్తుందని తెలిపారు.

# అఫ్గానిస్థాన్‌పై పాక్ భీకర దాడి

**-చిన్నారులు సహా 35 మంది మృతి**
**-సహాయక సిబ్బందిని లక్ష్యంగా చేసుకున్న పాక్ సైన్యం**
**- ప్రతీకార దాడులంటూ పాకిస్థాన్ వాదన**
**- పిరికిపంద చర్యగా అభివర్ణించిన జబిహుల్లా ముజాహిద్**
**-అంతర్జాతీయ శాంతిదూతగా నటిస్తూ పొరుగు దేశంపై దాడులు**
**- పాకిస్థాన్ ద్వంద్వ వైఖరిపై విమర్శలు**



న్యూఢిల్లీ,

అంతర్జాతీయ వేదికపై అమెరికా, ఇరాన్ దేశాల మధ్య శాంతిని నెలకొల్పేందుకు మధ్యవర్తిత్వం వహిస్తూ ప్రశంసలు అందుకుంటున్న పాకిస్థాన్ తన సొంత సరిహద్దుల్లో మాత్రం అఫ్గానిస్థాన్ పై భీకర దాడులకు పాల్పడుతోంది. అఫ్ఘనిస్థాన్ సరిహద్దుల్లో పాకిస్థాన్ సైన్యం తాజాగా జరిపిన వైమానిక దాడుల్లో కనీసం 35 మంది మరణించారు. మృతులంతా ఉగ్రవాదులేనని పాకిస్థాన్ వాదిస్తుండగా.. అమాయక పౌరులు, చిన్నారులు ప్రాణాలు కోల్పోయారని అఫ్గానిస్థాన్ ఆరోపిస్తున్నది. ఈ దాడుల్లో పాకిస్థాన్ సైన్యం అనుసరించిన వివాదాస్పద 'డబుల్ ట్యాప్ ' వ్యూహం తీవ్ర విమర్శలకు దారితీసింది. సైనిక పరిభాషలో 'డబుల్ ట్యాప్' అంటే ఒకే ప్రదేశంపై కొద్ది సమయం వ్యవధిలో రెండోసారి దాడి చేయడం. దీన్ని అత్యంత క్రూరమైన, అమానవీయమైన వ్యూహంగా పరిగణిస్తారు. ఎందుకంటే మొదటి దాడి తర్వాత సహాయక చర్యల కోసం వచ్చే సిబ్బంది, వైద్యులు, పౌరులను లక్ష్యంగా చేసుకుని రెండో దాడి జరుపుతారు. భారత కాలమానం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి 12:30 గంటలకు పాకిస్థాన్ వైమానిక దళం ఫైటర్ జెట్‌లు అఫ్గానిస్థాన్‌లోని పక్తికా, పక్తియా, కునార్ జిల్లాల్లోని ఇళ్లు, మసీదులపై బాంబులు వేశాయి. సరిగ్గా 25 నిమిషాల తర్వాత అంటే 12:55 గంటలకు శిథిలాల కింద చిక్కుకున్న మహిళలు, పిల్లలను కాపాడేందుకు గ్రామస్థులు పరుగెత్తుకురాగా.. పాకిస్థాన్ సైన్యం రెండోసారి బాంబుల వర్షం కురిపించింది. ఈ రెండో దాడితో మృతులు, క్షతగాత్రుల సంఖ్య అనూహ్యంగా పెరిగింది. వందకుపైగా క్షతగాత్రులతో ఆస్పత్రులు నిండిపోయాయి. గతవారం కరాచీలో తమ సైనిక దళాలపై జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారంగానే ఈ దాడులు జరిపినట్లు పాకిస్థాన్ ప్రకటించింది. తెహ్రీక్-ఇ-తాలిబన్ పాకిస్థాన్ నుంచి విడిపోయిన జమాత్-ఉల్-అహ్రార్ ఉగ్రవాదుల స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు జరిపామని, ఈ దాడుల్లో 29 మంది ఉగ్రవాదులు హతమయ్యారని పాకిస్థాన్ సమాచార శాఖ మంత్రి అత్తావుల్లా తారర్ తెలిపారు. అయితే పాకిస్థాన్ వాదనను ఆఫ్ఘనిస్థాన్‌లోని తాలిబన్ ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. ఇది పిరికిపందల చర్య అని, పాకిస్థాన్ దురాక్రమణకు పాల్పడిందని తాలిబన్ ప్రతినిధి జబీహుల్లా ముజాహిద్ మండిపడ్డారు. ఈ దాడుల్లో 35 మందికిపైగా అమాయక పౌరులు మరణించారని, వీరిలో 4 నుంచి 9 ఏళ్ల వయసున్న చిన్నారులు, వృద్ధులు ఉన్నారని ఆయన తెలిపారు. పాకిస్థాన్‌పై దాడి జరిగినప్పుడు ఆ ప్రాంతంలో ఎలాంటి ఉగ్రవాదులు లేరని, సహాయక చర్యల్లో పాల్గొంటున్న మాపైనే రెండోసారి బాంబు వేశారని అన్నారు. ప్రపంచాన్ని తప్పుదోవ పట్టించేందుకు పాకిస్థాన్ అబద్ధాలు చెబుతోంది" అని దాడిలో గాయపడిన ఒక స్థానికుడు ఆవేదన వ్యక్తంచేశాడు. కాగా అఫ్గానిస్థాన్‌లో 2021లో తాలిబన్‌లు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పాక్-అఫ్గాన్ సంబంధాలు ఉద్రిక్తంగానే ఉన్నాయని, సరిహద్దుల్లో ఉగ్రవాద కార్యకలాపాలకు ఆఫ్ఘనిస్థాన్ ఆశ్రయం ఇస్తోందని పాకిస్థాన్ ఆరోపిస్తుండగా.. తమ భూభాగంలో ఉగ్రవాదులు ఎవరూ లేరని తాలిబన్‌లు స్పష్టం చేస్తున్నారు. గత 9 నెల్లలో పాకిస్థాన్ జరిపిన దాడుల్లో సుమారు 570 మంది అమాయక అఫ్గాన్ పౌరులు ప్రాణాలు కోల్పోయారని నివేదికలు చెబుతున్నాయి. ఒకవైపు అంతర్జాతీయ శాంతిదూతగా వ్యవహరిస్తూ మరోవైపు పొరుగు దేశంపై దాడులకు పాల్పడటం పాకిస్థాన్ ద్వంద్వ వైఖరిని స్పష్టంచేస్తోంది.

# రైతు ఆశీర్వాద సభ వాయిదా

మొదటి తరువాయి

చేసిన మీడియా సమావేశంలో మంత్రులు మాట్లాడారు. వాతావరణ పరిస్థితులు, వర్షాల కారణంగా ఈ నెల 30న ఖమ్మం జిల్లా చింతకాని మండలం మత్కేపల్లి క్రాస్ రోడ్, జగన్నాథపురం గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యే రైతు ఆశీర్వాద సభను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. రైతులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో సభా ప్రాంగణం పూర్తిగా బురదమయంగా మారిందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో లక్షలాది మంది రైతుల సమక్షంలో సభ నిర్వహించడం సాధ్యం కాదన్నారు. రైతు భరోసా పంపిణీ పూర్తయిన అనంతరం మరింత వైభవంగా 'రైతు ఆశీర్వాద సభ' పేరుతో ముగింపు వేడుక నిర్వహిస్తామని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. వాతావరణ శాఖ నివేదికల ప్రకారం జిల్లాలో జులై 3 లేదా 4వ తేదీ వరకు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. మరో వారం రోజుల వాతావరణ పరిస్థితులను సమీక్షించి, అనుకూలిస్తే జులై 6 లేదా 7, 8వ తేదీల్లో సభ నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు వెల్లడించారు. స్థానిక మంత్రులు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికార యంత్రాంగం సమన్వయంతో ఏర్పాట్లు కొనసాగిస్తున్నట్టు తెలిపారు.

వర్షం అడ్డపడినా భరోసా ఆగదు : మంత్రి తుమ్మల

రైతు ఆశీర్వాద సభకు వర్షం అడ్డుపడినా రైతు భరోసా నిధుల విడుదల మాత్రం యథావిధిగా కొనసాగుతుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. వానాకాలం సాగు దృష్ట్యా రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా రైతు భరోసా నిధుల విడుదలకు సీఎం సిద్ధంగా ఉన్నారని, మంగళవారం హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు భరోసా పథకం నిధులను విడుదల చేస్తారని వెల్లడించారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేసే ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. కేవలం తొమ్మిది రోజుల్లోనే రూ.9 వేల కోట్లను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు. రైతు భరోసా, రుణమాఫీ అంశాలపై ప్రతిపక్ష నాయకులు అర్థంపర్థం లేని విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం పదేండ్లలో రైతుబంధు కింద రూ. 72 వేల కోట్లు ఇవ్వగా, ప్రజా ప్రభుత్వం కేవలం రెండున్నరేండ్లలోనే రైతు భరోసా ద్వారా రూ. 36 వేల కోట్ల సాయం అందించిందని తెలిపారు. యూరియా యాప్ ద్వారా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులు అందుతున్నాయన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం అన్ని రకాల పంటలను మద్దతు ధరకు కొనుగోలు చేస్తోందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మెన్ రాయల నాగేశ్వరరావు, ఆర్ అండ్ బీ ఎస్ఈ యాకూబ్, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాసాచారి, పీఆర్ఎస్ఈ వెంకట్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, మహబూబాబాద్ జిల్లా వ్యవసాయ అధికారి విజయ చందర్, డీఆర్డీవో శ్రీరామ్, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి సునీల్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# 2028 నుంచి పెట్రోల్ బైకుల రిజిస్ట్రేషన్ బంద్

**రూ.30 లక్షల లోపు ఈ-కార్లకు పన్ను రాయితీ**
**విద్యుత్తు వాహనాల పాలసీకి ఢిల్లీ సర్కార్ ఆమోదం**

**న్యూఢిల్లీ :**



దేశ రాజధానిలో స్వచ్ఛ రవాణా విధానం వైపు మళ్లింపును వేగవంతం చేసేందుకు రేఖా గుప్తా ప్రభుత్వం విస్తృత ప్రోత్సాహకాల ప్యాకేజీ ప్రకటించింది. లెఫ్టినెంట్ గవర్నర్ సంధు దీన్ని ఆమోదిస్తే జూలై 1 నుంచి దీన్ని అమలు చేస్తామని ఢిల్లీ సీఎం రేఖా గుప్తా సోమవారం తెలిపారు. ఈ విధానం 2030 మార్చి 31 వరకు అమల్లో ఉంటుందని చెప్పారు. ఈ విధానంలో విద్యుత్తు కార్లకు పన్ను రాయితీ, కొనుగోలు ప్రోత్సాహకం ఇవ్వనున్నారు.విద్యుత్తు ద్విచక్ర వాహనాలు కొనుగోలు చేసేవారికి మొదటి మూడేండ్లు వరుసగా రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు రాయితీగా ఇవ్వనున్నారు. విద్యుత్తు త్రిచక్ర వాహనాలు కొనేవారికి ఇదే విధంగా రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు ప్రోత్సాహకంగా ఇవ్వనున్నారు. 2027 జనవరి 1 నుంచి కేవలం విద్యుత్తు ఆటో రిక్షాలకు మాత్రమే రిజిస్ట్రేషన్ చేస్తారు. కొత్త పెట్రోల్, సీఎన్‌జీ ఆధారిత ద్వి చక్ర వాహనాలకు 2028 ఏప్రిల్ 1 నుంచి రిజిస్ట్రేషన్లు చేయరు.

# వాహనదారులకు ఊరట

**-జూలై 1 నుంచి పెట్రోల్, డీజిల్ ఆంక్షల ఎత్తివేత**
**- సాధారణ స్థితికి చేరిన ఇంధన సరఫరా:**
**-మళ్లీ అందుబాటులోకి పూర్తిస్థాయి ఇంధనం**
**-ఇరాన్-అమెరికా చర్చలతో మెరుగుపడిన పరిస్థితి**
**- ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్‌పై తొలగిన ఆంక్షలు:**



**న్యూఢిల్లీ :**

వాహనదారులకు గుడ్‌న్యూస్. పెట్రోల్, డీజిల్ సరఫరాపై విధించిన ఆంక్షలను కేంద్రం ఎత్తేయనుంది. దేశవ్యాప్తంగా ప్రస్తుతం పెట్రోల్, డీజిల్ సరఫరాపై ఆంక్షలను కొనసాగుతున్న జూలై 1వ తేదీ బుధవారం నుంచి ఎత్తివేస్తున్నట్టు వెల్లడించింది. దేశంలో పెట్రోలియం ఉత్పత్తులు సాధారణ స్థితికి చేరినందున ఈ నిర్ణయం తీసుకున్నట్టు కేంద్రం తెలిపింది.పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా పెట్రోలియం ఉత్పత్తుల కొరత ఏర్పడడంతో.. జూన్ 12వ తేదీన సరఫరాపై కేంద్రం ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. ఇరాన్, అమెరికా మధ్య శాంతి చర్చలు, ఒప్పందాలు కుదరడంతో పరిస్థితిలో మార్పు వచ్చింది. దాంతో, దేశంలో పెట్రోల్, డీజిల్ సరఫరా మునపటి స్థితికి చేరుకుంది. ఈ నేపథ్యంలోనే ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్‌పై విధించిన ఆంక్షలను జూలై 1 నుంచి కేంద్రం ఎత్తేయనుంది.

# దేశం గర్వించే రాజధాని నగరంగా అమరావతి

మొదటి తరువాయి

జరుగుతున్నాయని తెలిపారు. పనులు వేగంగా చేసేందుకు అవసరమైన మానవ వనరులు, యంత్రాలు ఇతర సామాగ్రిని ముందుగానే సిద్ధం చేసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. ప్రస్తుతం 26,924 మంది కార్మికులు, 5140కి పైగా భారీ యంత్రాలు నిర్మాణ పనుల్లో నిమగ్నమైనట్టు మంత్రి నారాయణ సీఎంకు వివరించారు. నిర్మాణ పనులకు ఎలాంటి ఆటంకమూ లేకుండా కొండవీటి వాగు, పాలవాగు ప్రవాహాలు సజావుగా సాగేందుకు వీలుగా వాటిని వెడల్పు చేస్తున్నామని మంత్రి తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం.. భవిష్యత్ నగరంగా నిర్మిస్తు?న్న అమరావతి నిర్మాణంలో పని చేశామన్న బ్రాండ్ ను కాంట్రాక్టర్లు సంపాదించేలా పనులు చేపట్టాలని సూచించారు. కొందరు వ్యక్తులు కావాలని లిటిగెంట్లుగా మారి రాజధాని పనుల్ని అడ్డుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నారని.. రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ముందుకు వెళ్లాలని సీఎం స్పష్టం చేశారు. కార్యదర్శులు, ప్రధాన కార్యదర్శుల నివాసాలు, రహదారులు, మౌలిక సదుపాయాలతో పాటు అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయ టవర్ల నిర్మాణాలపై ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. దేశవ్యాప్తంగా వివిధ పుణ్య క్షేత్రాలు, నదుల నుంచి పవిత్రమైన మట్టి, నీళ్లు తీసుకువచ్చి ఈ ప్రాంతాన్ని పునీతం చేశామని.. గత పాలకులు ఐదేళ్ల పాటు రాజధాని నిర్మాణాన్ని ఆపేశారని సీఎం అన్నారు. గడచిన రెండేళ్లుగా అమరావతి నిర్మాణాన్ని మళ్లీ గాడిలో పెట్టామన్నారు. అత్యుత్తమ నివాసయోగ్య నగరంగా నిర్మాణం చేస్తున్న అమరావతిలో భాగస్వాములం అయ్యామన్న ఆలోచనతో కాంట్రాక్టు సంస్థలు పనిచేయాలని సీఎం సూచించారు. పనులు పూర్తి అయ్యాక రాజధాని నిర్మాణాల ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీని ఆహ్వానిస్తామని సీఎం తెలిపారు. నిర్మాణ పనుల వేగంతో పాటు నాణ్యత పై కూడా ఎక్కడా రాజీ లేకుండా చేపట్టాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయ భవనాలు ఐకానిక్ నిర్మాణాలుగా ఉండాలని పేర్కొన్నారు. అమరావతికి పేరు తెచ్చేలా ఈ భవనాలను నిర్మించాలన్నారు. రాజధాని నిర్మాణంలో చిన్న ఇబ్బందులు కూడా లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ప్రతీ రెండు నెలలకు ఒకసారి నిర్మాణాల పురోగతిపై సమీక్షిస్తానని సీఎం స్పష్టం చేశారు. ఎల్ అండ్ టీ, షాపూర్ జీ పల్లోంజి, మెగా ఇంజినీరింగ్, ఎన్సీసీ, బీఎస్ఆర్, కేఎంవీ సహా వేర్వేరు కాంట్రాక్టు సంస్థలు చేపట్టిన పనులకు సంబంధించిన అంశాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయా సంస్థల ప్రతినిధులకు సీఎం దిశా నిర్దేశం చేశారు.

# హరీష్ రావుకు మెంటల్ బ్యాలెన్స్ తప్పింది

మొదటి తరువాయి

వ్యాఖ్యలపై పై విధంగా స్పందించారు. తెలంగాణ ప్రజానీకం మాకు ఐదేళ్లకు అధికారమిచ్చారు. రెండున్నరేళ్లకే ఎందుకు అసెంబ్లీని రద్దు చేస్తాం. ఇంకా రెండున్నరేళ్ల సమయం ఉంది. గడచిన రెండున్నర సంవత్సరాలలో జరిగిన ప్రతి ఎన్నికల్లోనూ ప్రజల తీర్పు ఏవిధంగా ఉందో హరీష్‌రావుకు తెలుసు. ఇప్పుడు కొత్తగా వచ్చే తీర్పు ఏముంది? రెండుకాళ్లు లేనివాడు చూసుకుందాం రా.. అని సవాలు విసిరినట్లే బిఆర్ఎస్ నాయకుల సవాళ్లు ఉంటున్నాయన్నారు. ఈ ప్రభుత్వం చేసే మంచిపనులను జీర్ణించుకోలేక భవిష్యత్తులో అధికారం దక్కదనే ఆవేశం, ఆక్రోశంతో కేటీఆర్ ఉక్రోషాన్ని వెళ్లగక్కుతున్నారు. నా నియోజకవర్గం పాలేరులో కేటీఆర్ విమర్శలు ఇదే కోవలోకి వస్తాయి. బిఆర్ఎస్ నాయకులు చేసే చిల్లర విమర్శలకు ప్రతిసారీ స్పందించను. ఎప్పుడో ఒకసారి కచ్చితంగా కర్ర కాల్చి వాత పెడతా. కేటీఆర్‌ను అరెస్ట్ చేస్తేనే బాంబులు పేలినట్టుకాదు. ప్రజలు ఛీ కొట్టినా బాంబులు పడ్డట్టే. ఏ వ్యక్తిమీదా వ్యక్తిగత కక్షపూరితమైన చర్యలు తీసుకోవాలనే ఆలోచన ఈ ప్రభుత్వానికి లేదు. తప్పుచేసిన వాళ్ళను జైలులో వేస్తేనే శిక్షించినట్లు కాదు. ప్రతి ఎన్నికల్లో వాళ్లను ఓడించి ప్రజలు శిక్షిస్తూనే ఉన్నారు. తమిళనాడు లాంటి పరిస్థితి ఈ రాష్ట్రంలో తీసుకురాం. అధికారంలోకి వస్తామని బిజేపీ పగటికలలు కంటోంది. ఆశ ఉండడంలో తప్పులేదు కానీ ఆ పార్టీ అత్యాశకు పోతోంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కనీసం డిపాజిట్ రాని పార్టీ అధికారం గురించి ఆశ పడుతోంది. బిజేపీ, బిఆర్ఎస్ ఒకే తాను ముక్కలు. కాళేశ్వరం అవినీతి, ధర్మల్ పవర్ ఎ÷-లాంట్ అక్రమాలపై సిబిఐ విచారణ చేయాలని అడిగితే బిజేపీ ఇప్పటివరకు స్పందించలేదు. ఈ సారి రైతు భరోసా నిధులను అనుకున్నదానికంటే రెండు మూడు రోజుల ముందే వారం రోజుల్లోనే రైతుల ఖాతాలో జమచేస్తాం. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇప్పటివరకు 18 నియోజకవర్గాలలో 23 స్థలాలను గుర్తించడం జరిగిందన్నారు. కొత్త రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేసే ఆలోచన ప్రభుత్వానికి లేదు. భూముల ధరల సవరణలు ఎక్కడైనా పొరపాటుగా ఎక్కువ ధర నిర్ణయిస్తే సరిచేయడానికి సిద్దంగా ఉన్నాం. తాండూరులో ఇదే విధంగా జరిగితే సరిదిద్దడం జరిగింది. అని మంత్రి పొంగులేటి అన్నారు.

# ఉద్యోగులకు తీపికబురు

మొదటి తరువాయి

రిటైర్డ్ సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగ జేఏసీ నాయకులకు ఇచ్చిన హామీ మేరకు, సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బకాయిలను 100 రోజుల్లో రూ. ఆరు వేల కోట్లు విడుదల చేస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గత నెల 29న మొదటి విడతగా రూ.రెండు వేల కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. రెండో విడతలో మరో రూ.రెండు వేల కోట్ల నిధులను విడుదల చేసి తన నిబద్ధతను నిరూపించుకుంది. ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తున్నది. అందులో భాగంగా రిటైర్డ్ ఉద్యోగులు, జిల్లా పరిషత్ ఉపాధ్యాయులకు సంబంధించిన జనరల్ ప్రావిడెంట్ ఫండ్ (జీపీఎఫ్) బకాయిలను వంద శాతం చెల్లించి, వారి ఖాతాలను పూర్తిగా క్లియర్ చేసినట్టు ప్రభుత్వం తెలిపింది. ప్రస్తుతం రిటైర్డ్ ఉద్యోగుల జీపీఎఫ్ ఖాతాల్లో ఎలాంటి పెండింగ్‌లు లేవని స్పష్టం చేసింది. రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించి గతేడాది సెప్టెంబర్ వరకు ఉన్న కమ్యూటేషన్ బకాయిలన్నింటినీ ప్రభుత్వం పూర్తిగా చెల్లించిందని పేర్కొంది. పెండింగ్‌లో ఉన్న రూ.పది వేలలోపు విలువ కలిగిన చిన్న మొత్తాల బిల్లులన్నింటినీ ప్రభుత్వం పరిష్కరించిందని తెలిపింది. ఈ విభాగంలో దాదాపు ఐదు లక్షలకుపైగా ఉన్న టోకెన్లను గుర్తించి, ఏమాత్రం జాప్యం లేకుండా చెల్లింపులు జరిపినట్టు పేర్కొంది. ప్రభుత్వ నిర్ణయంపై ఉద్యోగ సంఘాల నేతలు సంతోషం వ్యక్తం చేశారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ఉద్యోగుల సమస్యల పట్ల ప్రభుత్వం చూపుతున్న సానుకూల ధోరణి అభినందనీయమని తెలిపారు.

# సంపాదకీయం

## మన్ కీ జూట్"




భారత ప్రధాని నరేంద్రమోడీ తన 'మన్ కీ బాత్' 135వ ఎపిసోడ్‌లో ఆదివారం దేశ ప్రజలకు మరోసారి నీతిపాఠాలు చెప్పారు. అయితే ఈసారి ధన్యవాదాలతో తన ప్రసంగాన్ని ప్రారంభించారు. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో దేశ ప్రజలు బంగారం కొనుగోళ్లు తగ్గించడం, విదేశీ పర్యటనలను వాయిదా వేయడం వంటి దేశ ప్రయోజనాల కోసం ప్రజలు బాధ్యతగా వ్యవహరించారని ప్రశంసించారు. ప్రజలకు పొదుపు, త్యాగం, మిత వ్యయం చెప్పడం తప్పుకాదు. కానీ, ప్రజలకు చెప్పే సందేశం, సర్కార్ ఆచరణ ఒకేతీరులో ఉన్నాయా? అన్నదే అసలు ప్రశ్న. కష్టకాలంలో ప్రజలు త్యాగాలు చేయాలని పిలుపునివ్వడం మంచిదే, ఆ కష్టాలకు కారణాలేమిటన్నది వేరే అంశం. కానీ, ప్రభుత్వం తన ఖర్చులు, ప్రాధాన్యతలు, విధానాల విషయంలో ఎంతమేరకు మితవ్యయం పాటిస్తోంది? అన్నదే ప్రధాన ప్రశ్న. ప్రజలు బంగారం కొనద్దని చెప్పే ముందు, దాని దిగుమతులు పెరగడానికి దారితీస్తున్న ఆర్థిక విధానాలపై ప్రభుత్వం ఆత్మపరిశీలన చేసిందా? రూపాయి బలహీనపడటం, ద్రవ్యోల్బణం, పెట్టుబడు లపై అనిశ్చితి కార ణంగా ప్రజలు బంగారాన్ని భద్రమైన పెట్టుబడిగా ఎంచు కుంటున్న వాస్తవాన్ని విస్మరించలేం. బంగారం కొనుగోలు విలాసాలకు సంబం ధించినదే కాదు, దానిపై లక్ష?లాది మంది స్వర్ణకారులు, చిన్న నగల దుకాణాలు, చేతివృత్తుల జీవనం ఆధారపడి ఉంటుంది. ఈ నిర్ణయం వల్ల ఉపాధిపై పడే ప్రభావం ఏమిటి? ఈ ప్రశ్నలకు సమాధానం లేదు. అలాగే విదేశీ పర్యటనలను తగ్గించినందుకు ప్రజలకు కృతజ్ఞతలు చెప్పిన ప్రధాని, తన విదేశీ పర్యటనల వల్ల దేశానికి వచ్చిన ప్రత్యక్ష? పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు, దౌత్య ప్రయోజనాలపై కూడా స్పష్టమైన లెక్కలు చెప్పాలి కదా? ఇక పెట్రోల్,డీజిల్ పొదుపు పాటించాలని హితబోధ చేసిన మరుసటి రోజే మధ్యప్రదేశ్‌లో సౌభాగ్య సింగ్ ఠాకూర్ అనే బీజేపీ నేత, పాఠ్య పుస్తక సంస్థ ఛైర్మన్‌గా నియమితులైనందుకు ఉజ్జాయినీ నుంచి భోపాల్ వరకు భారీ వాహనాల కాన్వాయ్‌తో ప్రయాణించిన వీడియో వైరల్ అయింది. దీంతో 'ప్రజలు మాత్రమే త్యాగాలు చేయాలా?' అంటూ సోషల్ మీడియాలో ప్రశ్నల వర్షం కురిసింది. అంతెందుకు పొరుగు రాష్ట్రం ఏపీలో కూటమి మంత్రి ప్రధాని మాటలను స్ఫూర్తిగా తీసుకుని సైకిల్‌పై అధికారిక కార్యక్రమానికి వెళ్లాడు. కానీ, ఆయన వెనుక కార్లు, మీడియా వాహనాలు పరుగులు పెట్టాయి. ఇక్కడ 'పొదుపు' కాస్త మరింత 'భారం' అయింది. ప్రజలు పాటించారు సరే, పాలకులకే క్రమశిక్ష?ణ లేకపోతే ఎలా? అన్న నెటిజన్ల ప్రశ్నలకు సమాధానమేది? మన్ కీ బాత్‌లో అతి ముఖ్యమైన సందేశం ప్రజలు మూఢ నమ్మకాలను వీడి శాస్త్రీయ దృక్పథంతో ఆలోచిం చాలని సూచించడం. ప్రధాని చేసిన వ్యాఖ్యల్ని స్వాగతించాల్సిందే. శాస్త్రీయ దృక్పథం ప్రతి సమాజానికీ అవసరం. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వ విధానాలు, అధికార పార్టీ నాయకుల వైఖరి ఆ సందేశానికి అనుగుణంగా ఉన్నాయా? అనే ప్రశ్న తలెత్తుతోంది. రాజ్యాంగంలోని 51(ఎ)(హెచ్) అధికరణం శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం ప్రతి పౌరుడి విధిగా పేర్కొంటుంది. కానీ విద్యారంగంలో ఎన్‌సీఈఆర్‌టీ చేస్తున్న దేమిటి? చరిత్ర పాఠాలను మార్పులు చేశారు. పదో తరగతి పాఠ్యాంశం నుంచి 'డార్విన్ పరిణామ సిద్ధాంతం' తొలగించారు. వీటిపై విద్యావేత్తలు, శాస్త్రవేత్తలు ఎన్ని అభ్యంతరాలు వ్యక్తం చేసినా కేంద్రం పట్టించుకోలేదు. అలాగే శాస్త్రీయ ఆధారాలు లేని వాదనలు, మూఢ విశ్వాసాలను సమర్థించే వ్యాఖ్యలు బహిరంగ వేదికలపై వచ్చినప్పుడు ప్రభుత్వం లేదా అధికార పార్టీ వాటిని ఖండించడంలో చూపిన నిర్లక్ష్యంపై కూడా విమర్శలనేకం. కొన్ని విశ్వవిద్యాలయాల్లో జ్యోతిష్యం, భారతీయ జ్ఞాన సంప్రదాయాల కోర్సులు చేర్చడం, భూత వైద్యం లాంటి అంశాలు ప్రవేశపెట్టడంపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. విజ్ఞాన శాస్త్రానికి విరుద్ధమైన ప్రచారాలు, అశాస్త్రీయ వాదన లు, మూఢ విశ్వాసాలను రాజకీయంగా ప్రోత్సహించే ధోరణులు పెరగడానికి కారణం కేంద్రమేనన్న సంగతి దేశమంతా గమనిస్తూనే ఉంది. శాస్త్రీయ దృక్పథం ప్రజలకు మాత్రమే బోధించే నీతి కాదు, అది ప్రభుత్వ విధానాల్లో, విద్యా వ్యవస్థలో, ప్రజా ప్రతినిధుల ప్రవర్తనలోనూ ప్రతిబింబించాలి. ప్రజలు దేశం కోసం త్యాగం చేయడానికి సిద్ధంగా ఉంటారు. కానీ ఆ త్యాగాలలో ప్రభుత్వం కూడా భాగస్వామి కావాలి. ప్రజలకు పొదుపు చెప్పే పాలకులు, ప్రభుత్వ వ్యయాల్లో కూడా అదే క్రమశిక్షణను చూపాలి. మాటలకు, చేతలకు మధ్య అంతరం పెరిగినప్పుడు ప్రజలు ప్రశ్నించడం సహజం. 'త్యాగం ప్రజలకు, ప్రచారం ప్రభుత్వానికి' అనే భావన బలపడకుండా ఉండాలంటే, ఆచరణ తన సందేశాలకు నిదర్శనంగా నిలవాలి. లేదంటే 'మన్ కీ బాత్'లో ప్రధాని ఎన్ని హావభావాలు ప్రదర్శించినా, ఆవేదనగా మాట్లాడినా అది 'మన్ కీ జూట్'నే అవుతుంది తప్ప దేశానికి ఒరిగేదేమీ ఉండదు.

# సహజీవనం చేస్తున్న మహిళను హత్య చేసిన నిందితుడికి జీవిత ఖైదు.

**-ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్..**




**మెదక్ జిల్లా 29జూన్ (మహాప్రభ )**
శివంపేట్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన హత్య కేసులో నిందితుడు వడ్డే రాములు (33), హత్నూర మండలం పాల్పనూరు గ్రామానికి చెందిన వ్యక్తికి జిల్లా ప్రధాన న్యాయస్థానం జీవిత ఖైదు శిక్షతో పాటు రూ.5,000 జరిమానా విధించినట్లు మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ.. కొమ్మిరే నర్సమ్మ అలియాస్ రేణుక (30) తన భర్తతో విడిపోయి గత ఆరు సంవత్సరాలుగా సదాశివపేట పట్టణంలోని సిద్ధాపూర్ కాలనీలో తన తల్లిదండ్రులతో పాటు తన ఆరు సంవత్సరాల కుమారుడితో నివాసం ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేదన్నారు.
గత ఏడాది కాలంగా ఆమె హత్నూర మండలం పాల్పనూరు గ్రామానికి చెందిన వడ్డే రాములుతో సంగారెడ్డిలో గది అద్దెకు తీసుకుని సహజీవనం చేస్తోందని తెలిపారు. కుటుంబ ఆర్థిక అవసరాల కోసం రేణుక తరచూ డబ్బులు ఇవ్వాలని అడగడంతో ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరిగేవని, ఈ క్రమంలో నిందితుడు ఆమెపై దాడులకు కూడా పాల్పడేవాడని పేర్కొన్నారు. 2023 ఆగస్టు 23న ఉదయం బయట పనికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి రాములుతో కలిసి వెళ్లిన రేణుక సాయంత్రం వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించినప్పటికీ ఆమె ఆచూకీ లభించలేదన్నారు. మరుసటి రోజు చిన్న గోటిముక్కుల గ్రామ శివారులోని చకరిమెట్ల గుడి ఎదురుగా ఉన్న అటవీ ప్రాంతంలో ఓ మహిళ మృతదేహం ఉన్నట్లు సమాచారం అందగా, అక్కడికి చేరుకున్న తల్లిదండ్రులు ఎల్లయ్య, కిష్టమ్మ మృతదేహాన్ని రేణుకదిగా గుర్తించారని తెలిపారు.దర్యాప్తులో, డబ్బుల విషయంలో తలెత్తిన వివాదాలు మరియు ఇతర వ్యక్తిగత కారణాలతో రేణుకపై కక్ష పెంచుకున్న నిందితుడు ఆమెను హత్య చేయాలని ముందుగానే నిర్ణయించుకుని, అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి ఆమె చీరతో గొంతు బిగించి ఊపిరాడకుండా చేసి హత్య చేసినట్లు తేలిందన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు శివంపేట్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు.ఈ కేసులో అప్పటి దర్యాప్తు అధికారి తూప్రాన్ సీఐ శ్రీధర్ సమగ్ర దర్యాప్తు నిర్వహించి, పూర్తి సాక్ష్యాధారాలను సేకరించి న్యాయస్థానంలో ఛార్జిషీట్ దాఖలు చేశారని తెలిపారు. అనంతరం ప్రస్తుత దర్యాప్తు అధికారి వెంకట రాజా గౌడ్ విచారణలో సాక్షులను సమర్థవంతంగా ప్రవేశపెట్టగా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేష్ బలమైన వాదనలు వినిపించారని పేర్కొన్నారు. సమర్పించిన పూర్తి సాక్ష్యాధారాలు, సాక్షుల వాంగ్మూలాలు మరియు ఇతర ఆధారాలను పరిశీలించిన గౌరవ జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి నీలిమ నిందితుడు వడ్డే రాములును దోషిగా నిర్ధారించి జీవిత ఖైదు శిక్షతో పాటు రూ.5,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించినట్లు ఎస్పీ తెలిపారు.ఈ కేసులో శివంపేట్ ఎస్ఐ మధుకర్ రెడ్డి, కోర్టు లైజనింగ్ అధికారి ఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ రవీందర్ గౌడ్, శివంపేట్ సీడీఓ ఆనంద్, కేసు విచారణలో సహకారం అందించారని పేర్కొన్నారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన దర్యాప్తు అధికారులు, ప్రజా అభియోజకులు మరియు సహకరించిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు. హత్య వంటి తీవ్రమైన నేరాలకు పాల్పడే వారిపై చట్టం కఠినంగా వ్యవహరిస్తుందని, ప్రతి కేసులో శాస్త్రీయ దర్యాప్తు, పటిష్టమైన సాక్ష్యాధారాలతో బాధితులకు న్యాయం జరిగేలా మెదక్ జిల్లా పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు.

# ఎస్సై, కానిస్టేబుల్ పోస్టుల్లో మెదక్ జిల్లాకు అన్యాయం చేయొద్దు.

-మెదక్ జిల్లాను ఎందుకు విస్మరించారు?: ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.
--సోషల్ మీడియాలో వైరల్ నోటిఫికేషన్‌పై ఆందోళన.
-కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన
-మాజీ డిప్యూటీ స్పీకర్ యం.పద్మా దేవేందర్ రెడ్డి.



**మెదక్ జిల్లా -29జూన్ (మహాప్రభ )**
సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఎస్సై, కానిస్టేబుల్ నియామక నోటిఫికేషన్‌లో మెదక్ జిల్లాకు ఒక్క పోస్టు కూడా కేటాయించలేదన్న సమాచారంపై మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మా దేవేందర్ రెడ్డి స్పందించారు. మెదక్ జిల్లా గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులతో మాట్లాడారు. అక్కడ విద్యార్థులు మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మదేవేందర్ రెడ్డి కి వినతి అందజేశారు. వారి ఆందోళనను తెలుసుకుని జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ కు విద్యార్థులతో కలసి ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాల వారీగా రేషియో ప్రకారం పోలీస్ శాఖలోని ఖాళీలను భర్తీ చేసి మెదక్ జిల్లాకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఎస్సై, కానిస్టేబుల్ నియామక నోటిఫికేషన్‌లో మెదక్ జిల్లాకు ఒక్క పోస్టు కూడా లేకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందంటూ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న నోటిఫికేషన్‌లో 5 వేల ఎస్సై, కానిస్టేబుల్ పోస్టుల భర్తీని 31 జిల్లాలకు మాత్రమే కేటాయించారని, అందులో మెదక్ జిల్లా పేరు లేకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఈ నోటిఫికేషన్ అధికారికమా కాదా అన్న విషయాన్ని ప్రభుత్వం వెంటనే స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో పోలీసు శాఖలో సుమారు 19 వేల ఖాళీలు ఉన్నాయని, వాటిని భర్తీ చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యోగ క్యాలెండర్ విడుదల సమయంలో రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని, కానీ ఇప్పటి వరకు కనీసం 40 వేల పోస్టుల నోటిఫికేషన్ కూడా విడుదల చేయలేదని విమర్శించారు.మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో రెండు విడతల్లో 19 వేల చొప్పున మొత్తం 38 వేల ఎస్సై, కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం ఉన్న ఖాళీల ప్రకారం కనీసం 19 వేల పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసి, జిల్లాల వారీగా రేషియో ప్రకారం పోస్టులను కేటాయించాలని డిమాండ్ చేశారు.వైరల్ అవుతున్న జాబితాలో మెదక్ జిల్లాను పూర్తిగా విస్మరించడం అన్యాయమని, అధికారిక నోటిఫికేషన్ కూడా ఇదే విధంగా ఉంటే మెదక్ జిల్లా నిరుద్యోగ యువత తీవ్రంగా నష్టపోతారని అన్నారు. మెదక్ జిల్లాపై ప్రభుత్వం చిన్నచూపు ఎందుకు చూపుతోందో సమాధానం చెప్పాలని, జిల్లాకు రావాల్సిన పోస్టులను వెంటనే కేటాయించి విద్యార్థులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ ఉపాధ్యక్షులు ఏం లావణ్య రెడ్డి మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కృష్ణారెడ్డి,పట్టణ పార్టీ కన్వీనర్ కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు , కౌన్సిలర్లు జుబేర్ అహ్మద్ బట్టి ఉదయ్ కుమార్ దీపక్ కుమార్, మెదక్ హవెలిఘనపూర్,శంకరంపేట మండల పార్టీ అధ్యక్షులు ఎం అంజ గౌడ్ సిహెచ్.శ్రీనివాస్ రెడ్డి పట్లూరి రాజు,మాజీ కౌన్సిలర్లు మాయ మల్లేశం భీమరి కిషోర్, నాయకులు కొత్తపల్లి కిష్టయ్య ఇందాద్, గట్టేష్, కిరణ్, ఇస్మాయిల్, లక్ష్మణ్ మోహన్ నాయక్, ఎంబీపూర్ మహేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# నిర్దేశిత కార్యచరణ ప్రకారం ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ చేపట్టాలి.

**-రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి.**



**మెదక్ జిల్లా -29జూన్ (మహాప్రభ ).**
భారత ఎన్నికల సంఘం నిర్దేశిత కార్యాచరణ ప్రకారం ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ చేపట్టాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, ఈ.ఆర్.ఓ.లు, ఎ.ఈ.ఆర్.ఓ.లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ నిర్దేశిత కార్యచరణ ప్రకారం ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, వివరాల నమోదు ప్రక్రియను సమర్థవంతంగా చేపట్టాలని తెలిపారు. జూలై 24వ తేదీ వరకు ఇంటింటి సర్వే నిర్వహించి ప్రతి అర్హులైన ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేసి, పూరించిన తర్వాత సేకరించాలని, ఫారాల పంపిణీ ప్రక్రియను జూలై 1వ తేదీ నాటికి పూర్తి చేసి ప్రతి రోజూ పురోగతి నివేదికలను సమర్పించాలని తెలిపారు. ప్రతి బూత్ స్థాయి అధికారి తమ పరిధిలోని ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో ధృవీకరించి, ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు ఒకే పోలింగ్ కేంద్రంలో నమోదై ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటరుగా నమోదు కావడం చట్టరీత్యా శిక్షార్హమని ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. పేర్లు, ఇంటిపేర్లు, మహిళల వివాహానంతర ఇంటిపేరు మార్పులు వంటి వ్యత్యాసాలను పరిశీలించి వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిరంతర సమన్వయం కొనసాగిస్తూ బూత్ స్థాయి అధికారుల జాబితాలు, పోలింగ్ కేంద్రాల వివరాలు అందుబాటులో ఉంచాలని, రాజకీయ పార్టీలు నియమించిన బూత్ లెవల్ ఏజెంట్లతో తరచూ సమావేశాలు నిర్వహించి ఓటరు జాబితాకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. ప్రతి శనివారం జిల్లా స్థాయిలో, ప్రతి వారం నియోజకవర్గ స్థాయిలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. బూత్ స్థాయి అధికారులు బి.ఎల్.ఓ. యాప్‌ను తప్పనిసరిగా వినియోగించాలని, ఎం.ఎస్.ఎస్. వాలంటీర్లు, ఎం.సి.సి. క్యాడెట్లు, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, స్థానిక స్వచ్ఛంద సంస్థల సహకారాన్ని వినియోగించుకోవాలని, గిరిజన, సరిహద్దు ప్రాంతాలలో స్థానిక భాష తెలిసిన హెల్పింగ్ హ్యాండ్స్‌ను నియమించాలని తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారాలు సేకరించిన అనంతరం ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ప్రక్రియ పూర్తి అయిన స్టిక్కర్‌ను ప్రతి ఇంటికి అతికించాలని, ఫారాల పూరణ, సమర్పణపై ప్రజల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ ప్రతి ఈ.ఆర్.ఓ., ఎ.ఈ.ఆర్.ఓ. క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యటిస్తూ పనులను పర్యవేక్షించి, ప్రతి ఎన్యూమరేషన్ ఫారంపై సంబంధిత ఓటరు సంతకం ఉండేలా బూత్ స్థాయి అధికారులు నిర్ధారించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. విధుల సమయంలో ప్రతి బూత్ స్థాయి అధికారి తప్పనిసరిగా గుర్తింపు కార్డు ధరించాలని, కొత్తగా నియమితులైన బూత్ స్థాయి అధికారులకు సంబంధిత ఈ.ఆర్.ఓ.లు వెంటనే గుర్తింపు కార్డులు జారీ చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో శాసనసభ నియోజకవర్గాలకు సంబంధించి బూత్ స్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమాలు విజయవంతంగా పూర్తయ్యాయని, ఎన్యూమరేషన్ ఫారాలు, బి.ఎల్.ఓ. కిట్లు, ప్రచార సామగ్రి పంపిణీ పూర్తి చేయబడి, ఇంటింటి సర్వే కొనసాగుతోందని తెలిపారు. జిల్లాలో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసి ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ జిల్లా రెవెన్యూ అధికారి అంబదాస్ రాజేశ్వర్ , నర్సాపూర్ ఆర్డీవో రామకృష్ణ ఎన్నికల విభాగ సూపరింటెంట్ గఫార్ ఈ.ఆర్.ఓ.లు, ఎ.ఈ.ఆర్.ఓ.లు, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కొత్త నిబంధనలు ఉపాధి హామీ చట్టానికి వ్యతిరేకంజూలై 1 ధర్నాను విజయవంతం చేయాలి

**- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కంబాలపల్లి ఆనంద్**



**దేవరకొండ జూన్ 29 ( మహాప్రభ )**

వ్యవసాయ కార్మిక సంఘం దేశవ్యాప్తంగా పిలుపు మేరకు మల్లెపల్లి మండల బాపూజీ నగర్ గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు తంబాలపల్లి ఆనంద్ పరశురాములు, పాల్గొని కూలీలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రామీణ పేదల జీవనాధారంగా ఉన్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని తీసేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరిచే లేదా కూలీల హక్కులకు భంగం కలిగించే ఎలాంటి చర్యలనైనా తీవ్రంగా వ్యతిరేకిస్తామని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న కొత్త నిబంధనల వల్ల ఉపాధి కూలీల హక్కులు దెబ్బతింటాయని, ప్రస్తుతం అమలులో ఉన్న పాత విధానాన్నే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కూలీలకు నష్టం కలిగించే కొత్త చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. జూలై 1న మండల కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిస్తూ, ఉపాధి హామీ కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కావలి కృష్ణయ్య, ఉపాధి హామీ కూలీలు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏడుపాయల వనదుర్గ ఆలయానికి రూ.7 కోట్ల వరం

**-12 కాటేజీల నిర్మాణానికి నిధుల మంజూరు**

**-ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు చొరవ ఫలితం: బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు హఫీజ్ ఉద్దీన్**



**మెదక్ జూన్ 29(మహాప్రభ)**

మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గ అమ్మవారి ఆలయ అభివృద్ధికి రూ.7 కోట్ల నిధులు మంజూరుకావడం హర్షణీయమని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హఫీజ్ ఉద్దీన్ అన్నారు. ఆలయ ప్రాంగణంలో 12 కాటేజీల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు విడుదల చేయడం ద్వారా భక్తులకు మెరుగైన వసతి సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు.సోమవారం కాంగ్రెస్ నాయకులు రవి, అశోక్ రెడ్డితో కలిసి మాట్లాడిన ఆయన, దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని ఏడుపాయల ఆలయానికి స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు ప్రత్యేక చొరవతో అభివృద్ధి పనులు వేగం పుంజుకున్నాయని పేర్కొన్నారు. నిత్యం వేలాది మంది భక్తులు దర్శించుకునే ఈ క్షేత్రంలో వసతి సౌకర్యాల కొరతను గుర్తించిన ఎమ్మెల్యే రూ.7 కోట్లతో 12 కాటేజీల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారని చెప్పారు.భవిష్యత్తులో కూడా ఆలయ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని హఫీజ్ ఉద్దీన్ తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావుతో పాటు పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## కన్కల్ ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు

**విద్యార్థులతో మమేకమై సౌకర్యాలు, బోధనపై ఆరా**



**తాడ్వాయి జూన్ 29 (మహాప్రభ):**

సోమవారం రోజున తాడ్వాయి మండలం కన్కల్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. పాఠశాలలోని వసతులు, విద్యా బోధన తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా తరగతి గదులను సందర్శించిన ఎమ్మెల్యే విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. పాఠశాలలో చదువు ఎలా కొనసాగుతోంది, ఉపాధ్యాయులు పాఠాలు ఎలా బోధిస్తున్నారు, మధ్యాహ్న భోజనం, తాగునీరు, ఇతర సౌకర్యాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేయాలని పాఠశాల ఉపాధ్యాయులకు ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు, తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. అనంతరం గ్రామ సర్పంచ్ మైలారం రవీందర్ రెడ్డి,ని ఉప సర్పంచ్, చాకలి మహేష్ మరియు ఉపాధ్యాయులను, గ్రామస్తులు, మీ కృషి మర్చిపోలేరని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## తొనిగండ్లలో మహిళా సమైక్య భవనం ప్రారంభించిన ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్.



**మెదక్ జిల్లా -29జూన్ (మహాప్రభ )**

రామాయంపేట మండలం తొనిగండ్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన మహిళా సమైక్య భవనాన్ని మెదక్ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ ఈరోజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ మాట్లాడుతూ, “మహిళల ఆర్థిక స్వావలంబన, సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు తీసుకొచ్చింది. స్వయం సహాయక సంఘాల మహిళలకు ఉపాధి కల్పన, శిక్షణ, ఆర్థిక సహాయం అందిస్తున్నాం. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి. ఈ మహిళా సమైక్య భవనం ద్వారా గ్రామంలోని మహిళలకు సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి వీలు కలుగుతుంది. మహిళల అభ్యున్నతికి మా ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుంది” అని అన్నారు. గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామ మహిళల చిరకాల కోరిక అయిన సమైక్య భవనాన్ని మంజూరు చేసి, నిర్మాణం పూర్తి చేయించిన ఎమ్మెల్యే గారికి గ్రామ మహిళల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

## జైలు నుంచి విడుదలైన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను పరామర్శించిన మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి



**దేవరకొండ జూన్ 29( మహాప్రభ )**

నల్గొండ జిల్లా అధ్యక్షులు దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ ,మాజీ ఎమ్మెల్యేలు డా.గాదరి కిశోర్ కుమార్ , గొంగడి సునీత ,కంచర్ల భూపాల్ రెడ్డి , కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి , హుజూర్నగర్ సమన్వయ కర్త ఒంటెద్దు నర్సింహ రెడ్డి , బి ఆర్ ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ , మాజీ కార్పొరేషన్ చైర్మెన్లు పల్లె రవికుమార్ గౌడ్ , రామచంద్ర నాయక్ , కమిషన్ మాజీ మెంబర్లు కిశోర్ గౌడ్ , విద్యాసాగర్ , రాష్ట్ర నాయకులు వల్లమల్ల కృష్ణ , బిఆర్ ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పడాల సతీష్ , కడారి స్వామి యాదవ్ , మున్సిపల్ మాజీ చైర్మన్ సైదిరెడ్డి , నల్లగొండ పట్టణ అధ్యక్షుడు దేవేందర్ గౌడ్ , బొడ్డు గోపాల్ గౌడ్ ,తదితరులు

## నీట్ ప్రశ్నాపత్రం లీకేజీపై నిరసన తెలిపిన ఎస్ఎఫ్ఐ నాయకుల ముందస్తు అరెస్టులను వెంటనే నిలిపివేయాలి




**దేవరకొండ జూన్ 29( మహాప్రభ)**

స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ), తెలంగాణ జూన్ 29న నిర్వహించనున్న “చలో లోక్ భవన్”లి కార్యక్రమానికి ముందు ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ కార్యదర్శివెంకటేష్ పోలీసులు ముందస్తుగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తోంది శాంతియుతంగా నిరసన తెలియజేయడం ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధమైన హక్కు.ఆ హక్కును హరించే విధంగా ముందస్తు అరెస్టులకు పాల్పడటం పూర్తిగా ప్రజాస్వామ్య వ్యతిరేక చర్య దేశవ్యాప్తంగా జరిగిన నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడింది. పరీక్షా వ్యవస్థలో జరిగిన అవినీతి, అక్రమాలపై బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం, న్యాయం కోరుతున్న విద్యార్థుల గొంతును అణచివేయడానికి ప్రయత్నించడం అత్యంత విచారకరం.

## సర్పంచ్ ఎన్నికల్లో ఓటమి పాలైన బీఆర్ఎస్ అభ్యర్థికి ఆర్థిక సహాయం అందజేత

**- బిఆర్ఎస్ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్**



**దేవరకొండ జూన్ 29( మహాప్రభ )**

కొండ మల్లెపల్లి మండలం ఇటివలే జరిగిన స్థానిక ఎన్నికల గుడి తండ సర్పంచ్ అభ్యర్థి గా పోటీ చేసిన నేనావత్ అమర్ సింగ్ కొద్ది పాటి ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు వారి ఆర్థిక పరిస్థితినీ స్థానిక నాయకులు బిఆర్ఎస్. పార్టీ మాజీ ఎంపీటీసీ నేనావత్ శంకర్ నాయక్ మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు బాల నాయక్ అభ్యర్థన మేరకు కొంత నగదును స్థానిక బిఆర్ ఎస్. పార్టీ నాయకులు చేతుల మీదుగా బిఆర్ ఎస్. సర్పంచ్ అభ్యర్థి నేనావత్ అమర్ ఈసింగ్ అందించడం జరిగింది అనంతరం బిఆర్ ఎస్. దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్ శాలువాతో సత్కరించారు ఈ కార్యక్రమంలో పార్టీ పెండ్లిపాకాల మాజీ ఎంపీటీసీ నేనావత్ శంకర్ నాయక్, బి.ఆర్.ఎస్. మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు బాల నాయక్, గణేష్, వెంకటేష్, రవి, రాహుల్, పాండు, కుమార్, భాష, అశోక్ , చిట్టి బాబు, శ్రీను, ప్రేమ, వంశీ, విక్రమ్, బిఆర్ ఎస్. పార్టీ నాయకులు పెద్దిసెట్టి సత్యనారాయణ, వడ్త్య తండ మాజీ సర్పంచ్ వడ్త్య బలరాం నాయక్, జాగ్రు భావోజీ, కోటేష్, తదితరులు పాల్గొన్నారు.....

## కాంగ్రెస్ పార్టీ అభిమాని టీ పాయింట్ లో చాయ్ తాగిన ఎమ్మెల్యే....



**గాంధారి, జూన్ 29 (మహాప్రభ)**

గాంధారి మండల కేంద్రంలో గల తాజ్ టీ పాయింట్ వద్ద ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్, కాంగ్రెస్ కార్యకర్తలు టీ పాయింట్ వద్ద టీ తాగారు. అనంతరం చాయ్ ప్రియులకు కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న పథకాలు వాటి గురించి అవగాహన కాంగ్రెస్ పార్టీపై ఉన్న అభిప్రాయాన్ని తెలుసుకున్నారు. అనంతరం ప్రజలకు చేరుతున్న ప్రభుత్వ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు, సీనియర్ నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మదన్ మోహన్, డీసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ పటేల్






**గాంధారి, జూన్ 29 (మహాప్రభ)**

ఎల్లారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయడం, ప్రజలకు పార్టీని మరింత చేరువ చేయడం లక్ష్యంగా ఎమ్మెల్యే మదన్‌మోహన్, కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ డీసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ పటేల్ గాంధారి మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ మండల కార్యాలయాన్ని ఘనంగా ప్రారంభించారు. పార్టీ కార్యకర్తలు భారీ ర్యాలీతో ఘన స్వాగతం పలికారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి నూతన కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మదన్‌మోహన్, డీసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ పటేల్, కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, ప్రజా సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మరింతబాధ్యతాయుతంగా



పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే మదన్‌మోహన్ మాట్లాడుతూ.. ప్రజల విశ్వాసమే కాంగ్రెస్ పార్టీకి అతిపెద్ద బలమని, ప్రజల సంక్షేమం మరియు ఎల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండే సేవా వేదికగా ఈ నూతన కార్యాలయం నిలవాలని ఆకాంక్షించారు.

డీసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ పటేల్, మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలుస్తుందని, ఈ కార్యాలయం కార్యకర్తలకు మార్గదర్శక కేంద్రంగా, ప్రజల సమస్యల పరిష్కారానికి వేదికగా ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మల్లికార్జున్ పటేల్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగసాని శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ పరమేశ్వర్, స్థానిక సర్పంచ్ రేణుక సంజీవ్ యాదవ్, వివిధ గ్రామ సర్పంచులు, ఉప సర్పంచులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ఆకుల శ్రీనివాస్, శేఖర్, తూర్పు రాజు, లైన్ రమేష్, నీల రవి, టౌన్ అధ్యక్షుడు సంఘని సాయిబాబా, యూత్ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వసుంధర,యువజన కాంగ్రెస్ అధ్యక్షులు, వివిధ అనుబంధ విభాగాల నాయకులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నాలా పనులు వేగవంతం చేయాలి





-అధికారులకు బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి సూచన.

**గడ్డి అన్నారం – జూన్ 29 (మహాప్రభ)**
రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని పిడటి కాలనీలో ఎస్‌జీఆర్ టవర్స్ నుండి వెంకటేశ్వర స్వామి దేవాలయం, న్యూ గడ్డిఅన్నారం వరకు కొనసాగుతున్న నాలా అభివృద్ధి పనులను బీజేపీ నాయకుడు బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి ఈరోజు ఉదయం సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు.
ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్తీక్‌తో కలిసి పనుల పురోగతిని సమీక్షించారు. ఎస్‌జీఆర్ టవర్స్ సమీపంలో నాలా కనెక్టివిటీ మధ్యలో వాటర్ పైప్‌లైన్‌లు, కేబుల్ వైర్లు అడ్డంకిగా ఉండటంతో పనులు ఆలస్యమవుతున్నాయని అధికారులు వివరించారు. దీనిపై స్పందించిన బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో సమస్యలను తక్షణమే పరిష్కరించి, రానున్న వర్షాకాలానికి ముందే నాలా అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను కోరారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలని సూచించారు. వర్షాకాలంలో నీటి నిల్వలు, వరద ముప్పు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం అత్యంత అవసరమని ఆయన పేర్కొన్నారు. ప్రజల భద్రత, సౌకర్యాలే ప్రభుత్వ యంత్రాంగం ప్రధాన లక్ష్యంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇంజనీర్ విజయ్, జలమండలి మేనేజర్ మమత, కాంట్రాక్టర్ శ్రీకాంత్, జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్, విద్యుత్ శాఖ సిబ్బంది, జలమండలి సిబ్బంది, జీహెచ్‌ఎంసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతంలో బీఎల్‌ఏల పాత్ర కీలకం.

-ఓటరు జాబితాపై బీఎల్‌ఏలు అప్రమత్తంగా ఉండాలి.
-ప్రతి బూత్‌లో పార్టీని మరింత బలోపేతం చేయాలి.
-బీఆర్ఎస్ పార్టీ బీఎల్‌ఏలకు ఐడీ కార్డులు అందజేసిన మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి.



**మెదక్ జిల్లా –29జూన్ (మహాప్రభ )**
బూత్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంలో బీఎల్‌ఏల పాత్ర ఎంతో కీలకమని,ఓటరు జాబితాపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి, అర్హులైన ప్రతి ఓటరు పేరు నమోదు అయ్యేలా బాధ్యతాయుతంగా పనిచేయాలని మాజీ డిప్యూటీ స్పీకర్, టిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు యం.పద్మ దేవేందర్ రెడ్డి బిఎల్‌ఏలకు సూచించారు. సోమవారం మెదక్ పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మెదక్ పట్టణానికి చెందిన బీఎల్‌ఏలకు ఐడీ కార్డులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటరు జాబితా అత్యంత కీలకమైందని, దానిని ఎప్పటికప్పుడు పరిశీలించి లోపాలు లేకుండా చూడాల్సిన బాధ్యత బీఎల్‌ఏలపై ఉందన్నారు. ఎన్నికల సంఘం చేపట్టే ప్రతి కార్యక్రమంపై పూర్తి అవగాహనతో పనిచేస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా,అనర్హుల పేర్లు తొలగించేలా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పార్టీ దృష్టికి తీసుకెళ్లాలని, పార్టీ కార్యక్రమాలను ఇంటింటికీ చేరవేయడంలో సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ కార్యకర్తలు, నాయకుల మధ్య సమన్వయంతో పనిచేస్తే సంస్థాగతంగా పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు.రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి బూత్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని,ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వొద్దని సూచించారు. ప్రతి బీఎల్‌ఏ తనకు కేటాయించిన బూత్‌లో నిరంతరం ప్రజలతో మమేకమై పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో మెదక్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అకిరెడ్డి.కృష్ణారెడ్డి, బిఆర్ఎస్ పార్టీ కన్వీనర్ కౌన్సిలర్ మామిళ్ళ ఆంజనేయులు,కౌన్సిలర్లు జుబెర్ అహ్మద్,బట్టి ఉదయ్, మ్యాదరి. దీపక్ కుమార్,మాజీ కౌన్సిలర్ లు మాయ. మల్లేశం,బీమరి కిషోర్, పార్టీ బిఎల్‌ఏలు తదితరులు పాల్గొన్నారు.

## బాలికల భద్రతపై విద్యార్థినులకు అవగాహన.

-వేధింపులు ఎదురైతే వెంటనే ఫిర్యాదు చేయాలి.
-బాలికల రక్షణే సమాజ అభివృద్ధికి పునాది:
-తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్




**మెదక్ జిల్లా –29జూన్ (మహాప్రభ )**
మహిళలు, బాలికల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, వేధింపులు లేదా అనుమానాస్పద ఘటనలు ఎదురైతే వెంటనే పోలీసులను ఆశ్రయించాలని తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్ సూచించారు. మెదక్ జిల్లా షీ టీమ్ ఆధ్వర్యంలో సోమవారం దాతర్‌పల్లి టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ పాఠశాల, కళాశాల హాస్టల్‌లో విద్యార్థినుల కోసం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మహిళల భద్రత, బాలికల రక్షణ, సైబర్ నేరాల నివారణ, మానవ అక్రమ రవాణా, బాల్య వివాహాల నిర్మూలన, బాల కార్మిక వ్యవస్థ దుష్పరిణామాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈవ్‌టీజింగ్, స్టాకింగ్, సోషల్ మీడియా వేధింపులు వంటి ఘటనలను సహించకుండా వెంటనే షీ టీమ్, మహిళా హెల్ప్ డెస్క్ లేదా అత్యవసర సేవ ఇ ఆర్ యస్ యస్ 112ను సంప్రదించాలని సూచించారు. టీ–సేఫ్ యాప్ వినియోగం, షీ టీమ్ సేవలు, మహిళా హెల్ప్ డెస్క్ ద్వారా అందుతున్న రక్షణ చర్యల గురించి వివరించారు. సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత సమాచారం, ఫోటోలు, బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు, పాస్‌వర్డు ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. సైబర్ నేరస్థులు యువతను వివిధ మార్గాల్లో వలలో వేసుకునే ప్రయత్నాలు చేస్తున్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. నేటి బాలికలే రేపటి సమాజానికి బలమైన పునాది అని, తమ హక్కులు, చట్టపరమైన రక్షణపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని డీఎస్పీ పేర్కొన్నారు. ఎలాంటి బెదిరింపులు, వేధింపులు ఎదురైనా భయపడకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ ఎసై గంగా రాజు, షీ టీమ్ సిబ్బంది, పాఠశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు

## రియాన్ష్ యాదవ్ జన్మదినం సందర్భంగా పేద విద్యార్థులకు అల్పాహారం

- శ్రీ కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా జన్మదిన వేడుకలు





**ఎల్.బి.నగర్, – జూన్ 29 (మహాప్రభ)**
శ్రీ కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో సమితి ఎగ్జిక్యూటివ్ సభ్యుడు సతీష్ యాదవ్ కుమారుడు మాస్టర్ రియాన్ష్ యాదవ్ జన్మదినాన్ని పురస్కరించుకుని పేద పిల్లల పాఠశాలలో అల్పాహార సేవా కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 250 మంది పేద విద్యార్థులకు శుభ్రమైన, రుచికరమైన, పోషకాహారంతో కూడిన అల్పాహారాన్ని అందజేశారు. అనంతరం చిన్నారుల సమక్షంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. విద్యార్థులు మాస్టర్ రియాన్ష్ యాదవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా మండలి సభ్యులు, కృష్ణ గోపాల్ సేవా సమితి అధ్యక్షులు డా. కపిల్ కుమార్ అగర్వాల్, సమితి అధికారులు, ఎగ్జిక్యూటివ్ సభ్యులు పాల్గొన్నారు. వారు మాస్టర్ రియాన్ష్ యాదవ్‌కు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయురారోగ్యాలు, విద్యలో ఉన్నత విజయాలు, సుఖసంతోషాలు కలగాలని భగవంతుణ్ని ప్రార్థించారు. ఈ సందర్భంగా సమితి ప్రతినిధులు మాట్లాడుతూ, “మానవ సేవే మాధవ సేవ” అనే మహోన్నత ఆశయంతో శ్రీ కృష్ణ గోపాల్ సేవా సమితి నిరంతరం అన్నదానం, అల్పాహార పంపిణీ, విద్యార్థులకు సేవా కార్యక్రమాలు, సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు.

## సిసి రోడ్ నిర్మాణానికి ఎమ్మెల్యే హామీ సంఘ సభ్యులు శాలువా సన్మానం



**గాంధారి, జూన్ 30 (మహా ప్రభ)**
ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్, పద్మశాలి సంఘ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా సన్మానం చేశారు. గాంధారి మండలం కేంద్రంలో నారాయణ గిరి వద్ద శివ భక్త మార్కండేయ మందిరం సిసి రోడ్ నిర్మాణం కోసం ఎమ్మెల్యే తప్పనిసరి సిసి రోడ్డు పని చేస్తున్నారని అని హామీ ఇచ్చాడు. సంఘ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. మండల అధ్యక్షుడు గుంటుకు అశోక్, పట్టణసంఘం అధ్యక్షులు క్యాతం కృష్ణ, ఉపాధ్యక్షులు సామల రాజు, కోశాధికారులు తాటిపాముల శివ, కార్యదర్శులు, సామల విజయ్, అంబల్ల సంతోష్, తలకొక్కుల శంకర్, శ్రీనివాస్, భాస్కర్, సంఘ పెద్దలు, సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## దేమీకలాన్--లింగంపల్లి రహదారి అభివృద్ధికి శ్రీకారం

-రూ.20 కోట్లతో రెండు వరుసల రహదారి పనులకు శంకుస్థాపన





**తాడ్వాయి,జూన్ 29 (మహాప్రభ)**
దేమీకలాన్ నుంచి లింగంపల్లి వరకు రూ.20 కోట్ల వ్యయంతో నిర్మించనున్న రెండు వరుసల రహదారి పనులకు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నా చిన్న తనంలో నేను ఎర్ర పహాడ్ గ్రామంలో చదువుకున్నానని, అయినా చెప్పుకొచ్చారు. గతంలో ఈ రహదారిపై ప్రయాణించేందుకు ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. ప్రజల సౌకర్యార్థం రహదారుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గంలోని బీటీ రోడ్ల సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడంతో గ్రామాల అభివృద్ధికి ప్రజలకు సౌకర్యవంతమైన ప్రయాణం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్, మరియు ఉపసర్పంచ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, వార్డ్ సభ్యులు, అధికారులు, గ్రామస్తులు, తదితరులు ,పాల్గొన్నారు.

## ఏడుపాయల వనదుర్గ ఆలయానికి రూ.7 కోట్ల వరం

-12 కాటేజీల నిర్మాణానికి నిధుల మంజూరు
-ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు చొరవ ఫలితం:
-బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు హఫీజ్ ఉద్దీన్.



**మెదక్ జిల్లా –29జూన్ (మహాప్రభ )**
మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గ అమ్మవారి ఆలయ అభివృద్ధికి రూ.7 కోట్ల నిధులు మంజూరుకావడం హర్షణీయమని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హఫీజ్ ఉద్దీన్ అన్నారు. ఆలయ ప్రాంగణంలో 12 కాటేజీల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు విడుదల చేయడం ద్వారా భక్తులకు మెరుగైన వసతి సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు.సోమవారం కాంగ్రెస్ నాయకులు రవి, అశోక్ రెడ్డితో కలిసి మాట్లాడిన ఆయన, దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని ఏడుపాయల ఆలయానికి స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు ప్రత్యేక చొరవతో అభివృద్ధి పనులు వేగం పుంజుకున్నాయని పేర్కొన్నారు. నిత్యం వేలాది మంది భక్తులు దర్శించుకునే ఈ క్షేత్రంలో వసతి సౌకర్యాల కొరతను గుర్తించిన ఎమ్మెల్యే రూ.7 కోట్లతో 12 కాటేజీల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారని చెప్పారు.భవిష్యత్తులో కూడా ఆలయ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని హఫీజ్ ఉద్దీన్ తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావుతో పాటు పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఇంపాక్ట్ ట్రైనర్‌గా గాండ్ల శ్రీనివాస్



**కరీంనగర్, – జూన్ 29 (మహాప్రభ)**
ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ నిర్వహించిన 30 రోజుల ఆన్లైన్ శిక్షణతో పాటు రెండు రోజుల ఆఫ్లైన్ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన అడ్వకేట్ గాండ్ల శ్రీనివాస్ ప్రొవిజినల్ ట్రైనర్‌గా అర్హత సాధించారు. ముగింపు కార్యక్రమంలో ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ సుధీర్ సంద్ర, ఇంపాక్ట్ క్లబ్ వ్యవస్థాపకుడు గంప నాగేశ్వరరావు చేతుల మీదుగా ఆయనకు సర్టిఫికెట్ అందజేశారు. శిక్షణ ద్వారా పొందిన నైపుణ్యాలను సమాజ అభివృద్ధికి వినియోగించి యువతకు ప్రేరణగా నిలుస్తానని శ్రీనివాస్ తెలిపారు.ఈ కార్యక్రమంలో శిక్షకులు, నిర్వాహకులు, శిక్షణార్థులు పాల్గొని ఆయనను అభినందించారు.

# బిజినెస్

## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..

-పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలే కారణం..!



దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం నష్టాలతో ముగిశాయి. పశ్చిమాసియా లో మళ్లీ తలెత్తిన ఉద్రిక్తతల నేపథ్యంలో మదుపరులు అమ్మకాలకు మొగ్గుచూపారు. దీనికితోడు ఆటో, ఐటీ, ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ స్టాక్స్ లో అమ్మకాల ఒత్తిడి పెరగడంతో సూచీలు భారీగా నష్టపోయాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 372.10 పాయింట్లు నష్టపోయి 76,728.37 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 109.75 పాయింట్లు క్షీణించి 23,946.25 వద్ద ముగిసింది. అంతర్జాతీయంగా నెలకొన్న ఆందోళనలతో ట్రేడర్లు రిస్క్ తీసుకోవడానికి వెనుకాడారు. దాంతో దాదాపు అన్ని రంగాల్లోనూ అమ్మకాలు వెల్లువెత్తాయి. ముఖ్యంగా మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా మోటార్స్ షేర్లు ప్రధాన నష్టాల్లో ఉన్నాయి. సాంకేతిక నిపుణుల విశ్లేషణ ప్రకారం.. నిఫ్టీకి 24,000 కీలక నిరోధంగా మారింది. దీనిని దాటితే 24,100-24,200 స్థాయిల్లో అమ్మకాల ఒత్తిడి ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఇక దిగువన 23,900 తక్షణ మద్దతుగా, 23,800 బలమైన మద్దతుగా పనిచేస్తుందని వారు తెలిపారు. ట్రేడింగ్‌లో ఫార్మా, మెటల్, హెల్త్‌కేర్ రంగాలు రాణించగా.. ఆటో, కెమికల్, ఆయిల్ అండ్ గ్యాస్ రంగాలు అత్యధికంగా నష్టపోయాయి. బ్రాడర్ మార్కెట్లలోనూ మిడ్‌క్యాప్ సూచీ 0.37 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.62 శాతం మేర నష్టపోయాయి. రాబోయే రోజుల్లో పశ్చిమాసియా పరిణామాలు, ఇతర అంతర్జాతీయ సంకేతాలు మార్కెట్ గమనాన్ని నిర్దేశిస్తాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

## పడిపోతున్న పసిడి ధరలు.. భయంతో జనం ఏం చేస్తున్నారో చూడండి!



దేశీయ మార్కెట్‌లో బంగారం ధరలు తగ్గుముఖం పట్టడంతో భారతీయ కుటుంబాలలో సరికొత్త ట్రెండ్ కనిపిస్తోంది. రికార్డు స్థాయి ధరలతో కొంతకాలంగా సామాన్యుడికి అందనంత ఎత్తుకు చేరిన బంగారం ధరలు.. ఒక్కసారిగా తగ్గుముఖం పట్టాయి. పసిడి ధరలు మరింత పడిపోతాయనే భయంతో భారతదేశంలోని అనేక కుటుంబాలు తమ వద్ద ఉన్న పాత బంగారు ఆభరణాలను విక్రయించడానికి మొగ్గు చూపుతున్నాయి. ప్రపంచంలోనే బంగారాన్ని అత్యధికంగా వినియోగించే రెండో పెద్ద దేశమైన భారత్‌లో, రీటైల్ ఇన్వెస్టర్లు, సాధారణ కొనుగోలుదారులలో నెలకొన్న అప్రమత్తతకు ఈ తాజా ట్రెండ్ అద్దం పడుతోంది. ఇండియా బులియన్ ఢ జ్యువెలర్స్ అసోసియేషన్ అందించిన సమాచారం ప్రకారం.. కేవలం ఏప్రిల్-జూన్ త్రైమాసికంలోనే వినియోగదారులు దాదాపు 50 టన్నుల పాత బంగారాన్ని విక్రయించారు. ఇది గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఏకంగా 43 శాతం వృద్ధి. ఈ ఏడాది ప్రారంభంలో 10 గ్రాముల బంగారం ధర గరిష్టంగా రూ.1.8 లక్షల నుండి రూ.1.4 లక్షలకు పడిపోవడంతో, రానున్న రోజుల్లో ఇది మరింతగా రూ.1.2 లక్షలకు తగ్గుతుందనే అంచనాలు వినియోగదారుల్లో నెలకొన్నాయి. అందుకే పాత నగల స్థానంలో కొత్తవి తీసుకునే సాంప్రదాయాన్ని పక్కనబెట్టి, నేరుగా నగదుగా మార్చుకుని లాభాలు పొందుతున్నారు. ఈ మార్పు దేశీయ బంగారం రీసైక్లింగ్ పరిశ్రమకు పెద్ద ఊపునిస్తోంది. ఇళ్లలో నిరుపయోగంగా ఉన్న బంగారం మార్కెట్లోకి రావడం వల్ల జ్యువెలర్లకు నిరంతరాయంగా ముడిసరుకు లభిస్తోంది. దేశవ్యాప్తంగా వందలాది గోల్డ్ పాయింట్ల నెట్‌వర్క్ కలిగిన సంస్థల్లో పాత బంగారం సేకరణ 40 శాతం పెరిగింది. దీనిని శుద్ధి చేసి మళ్లీ 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారంగా మారుస్తున్నారు. భారతదేశం 2026 ఆర్థిక సంవత్సరంలో సుమారు 7240 కోట్ల రూపాయల విలువైన బంగారాన్ని దిగుమతి చేసుకుంది. అయితే ప్రస్తుత ధోరణి చూస్తుంటే, గతంలో 125 నుండి 150 టన్నులుగా ఉన్న రీసైకిల్డ్ బంగారం వాటా, రాబోయే రోజుల్లో ఏకంగా 200 నుండి 250 టన్నులకు పెరిగే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. భారతీయ గృహాలలో దాదాపు 30,000 టన్నుల భారీ బంగారు నిల్వలు ఉన్నట్లు ఒక అంచనా. ఇలా ఇళ్లలోని నిరుపయోగ బంగారం మార్కెట్ చలామణిలోకి రావడం వల్ల విదేశీ దిగుమతులపై దేశం ఆధారపడటం క్రమంగా తగ్గుతూ, దేశీయ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని విశ్లేషకులు చెబుతున్నారు.

## ఈ-కామర్స్ సంస్థల ఆఫర్లు షురూ

### జూలై 4 నుంచి అమెజాన్ ప్రైమ్‌డే




న్యూఢిల్లీ,
ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ మళ్లీ ప్రైమ్‌డే ఉత్సవాన్ని జరుపుకోనున్నట్టు ప్రకటించింది. జూలై 4 నుంచి 6 వరకు మూడు రోజుల పాటు జరుగనున్న పదో ఎడిషన్ ప్రైమ్‌డే ఉత్సవాల్లో అన్ని రకాల ఉత్పత్తులపై భారీ రాయితీలను అందించను న్నది. ప్రైమ్ మెంబర్లకు అన్ని రకాల ఉత్పత్తులపై 60 శాతం వరకు రాయితీ లభించనున్నది. ప్రైమ్ మెంబర్లపై వసూలు చేసే ఫీజును రూ.500 తగ్గించింది. దీంతో రూ.999 చెల్లించి ప్రైమ్ మెంబర్లుగా చేరవచ్చునని తెలిపింది. కస్టమర్ల అదేరోజు, ఆ తర్వాతి రోజు అందించడానికి ఇప్పటికే వేలాది మంది తాత్కాలిక ఉద్యోగులను నియమించుకున్నది.

# స్పోర్ట్స్

## ఇంగ్లండ్ క్రికెట్‌లో పోరాట యోధుడు.. టెస్టులంటే ప్రాణమిచ్చే పోటుగాడు..!



ఇంగ్లండ్ క్రికెట్‌ను 'బెన్ స్టోక్స్‌కు ముందు.. స్టోక్స్ తర్వాత' అని కచ్చితంగా చెప్పవచ్చు. ఎందుకంటే.. సంప్రదాయ క్రికెట్‌నే నమ్ముకున్న జట్టుకు దూకుడు నేర్పిన కెప్టెన్లలో స్టోక్స్ పేరు ముందు వరసులో ఉంటుంది. ఎంత పెద్ద లక్ష్యమైనా సరే.. వికెట్లు పడుతున్నా సరే.. దంచుడే పరమావధిగా ఆడడం అతడి నైజం. 2022లో జో రూట్ వారసుడిగా టెస్టు పగ్గాలు అందుకున్న స్టోక్స్.. బజ్‌బాల్ ఆటను పరిచయం చేశాడు. బ్రెండన్ మెక్‌కల్లమ్ హెడ్‌కోచ్‌గా, దూకుడే మంత్రగా ఆడే స్టోక్స్ సారథ్యంలో.. సుదీర్ఘ ఫార్మాట్‌లోనూ వన్డే తరహాలో ఆడడం అలవర్చుకుంది ఇంగ్లండ్.

**ఈ లక్షణాలతో..**

ఓటమిని అంగీకరించని మనస్తత్వం, సానుకూల దృక్పథం ఇంగ్లండ్ ఆటగాళ్ల ఆలోచనన తీరును మార్చేశాయి. ఓడిపోతామనే భయం లేకుండా ఆడడం నేర్పిన స్టోక్స్.. టెయిలెండర్లలో స్ఫూర్తి రగిలించి సంచలన విజయాలకు ఆద్యుడయ్యాడు. అంతేకాదు.. నాయకుడిగా ముందుడి జట్టుని నడపించడం అతడి ప్రత్యేకతల్లో ఒకటి. ఒత్తిడిలోనూ రాణించడం, వికెట్ అవసరమైన ప్రతిసారి బంతి అందుకోవడం వంటివి అతడిని గొప్ప సారథిగా మలిచాయి. కానీ, అనూహ్యంగా అదే బజ్ బాల్ వ్యూహం ఆ జట్టును దెబ్బతీసింది. కెప్టెన్‌గా చెరగని ముద్ర వేసిన స్టోక్స్.. జూన్ 29 సోమవారంతో అంతర్జాతీయ క్రికెట్‌ను వదిలేశాడు. మూడు ఫార్మాట్లలో విధ్వంసక ఆటతో అలరించిన అతడు ఎక్కువగా ప్రేమించింది, ప్రాణంగా భావించింది మాత్రం టెస్టులనే. టెస్టుల కోసం వన్డేలకు వీడ్కోలు పలికిన ఈ ఆల్‌రౌండర్, ఈసీబీ, జోస్ బట్లర్ కోరిక మేరకు 2023 వన్డే ప్రపంచకప్‌లో ఆడాడు. కానీ, మోకాలి గాయంతో.. కొన్ని రోజులు విశ్రాంతి తీసుకున్న స్టోక్స్ మళ్లీ మైదానంలోకి దిగాడు. అయితే.. భారత పర్యటనలో.. ఆపై యాషెస్ సిరీస్‌లోనూ స్టోక్స్ సేన కుదేలైంది. బజ్‌బల్‌పై వ్యతిరేకత, అతడి కెప్టెన్సీపై అనుమానాలు మొదలయ్యాయి. స్వదేశంలో న్యూజిలాండ్ దెబ్బకు ఓవల్ టెస్టులో 253 రన్స్ తేడాతో ఓడడం స్టోక్స్‌ను రిటైర్మెంట్ ప్రకటించేందుకు దారి తీసిందని చెప్పాలి.

**135 నాటౌట్**

యాషెస్ టెస్టు(2019)లో 359 పరుగుల ఛేదనలో ఓటమి అంచున నిలిచిన ఇంగ్లండ్‌ను ఒంటిచేత్తో గెలిపించిన ఘనడు. చివరి బ్యాటర్ జాక్ లీచ్‌తో 76 రన్స్ జోడించిన స్టోక్స్ (135 నాటౌట్) చిరస్మరణీయ విజయాన్ని కట్టబెట్టాడు. అదే ఏడాది వన్డే ప్రపంచకప్ ఫైనల్లో 97 పరుగులతో అజేయంగా నిలిచిన ఈ ఆల్‌రౌండర్.. ఇంగ్లండ్‌కు మొట్టమొదటి వరల్డ్‌కప్‌ను ముద్దాడడంలో కీలకయమ్యాడు. మొత్తంగా 122 టెస్టుల్లో.. 7273 పరుగులు సాధించాడు. 14 శతకాలు, 37 అర్ధ శతకాలు ఉండగా.. అత్యధిక స్కోర్ 258(దక్షిణాఫ్రికాపై 2016లో). బంతితోనూ మెరిసిన స్టోక్స్ 252 వికెట్లు పడగొట్టాడు. అత్యుత్తమ ప్రదర్శన 6-22.

## హెడ్‌కోచ్ గౌతమ్ గంభీర్‌పై ఐస్‌లాండ్ క్రికెట్ సెటైర్లు



ఐర్లాండ్ గడ్డపై టీమిండియాకు చరిత్రలోనే ఊహించని షాక్ తగిలింది. రెండు టీ20ల సిరీస్‌ను పసికూన ఐర్లాండ్ 2-0తో క్లీన్‌స్వీప్ చేసి భారత్‌కు ఘోర పరాజయాన్ని పరిచయం చేసింది. ఈ ఓటమితో భారత క్రికెట్ జట్టు హెడ్‌కోచ్ గౌతమ్ గంభీర్‌పై సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలోనే ఐస్‌లాండ్ క్రికెట్ అసోసియేషన్.. గంభీర్‌కు అసాధారణ ప్రతిభ ఉందంటూ, అలాంటి కోచ్ తమకు వద్దంటూ అధికారిక ఖాతాలో వేసిన సంచలన సెటైరికల్ పోస్ట్ ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. టీ20 ఛాంపియన్‌గా ఐర్లాండ్ గడ్డపై అడుగుపెట్టిన భారత్‌కు.. భారీ భంగపాటు ఎదురైంది. పసికూన ఐర్లాండ్‌తో జరిగిన రెండు టీ20 మ్యాచ్‌లలోనూ టీమిండియా పరాజయం పాలైంది. దీంతో చరిత్రలో తొలిసారిగా ఆ జట్టు చేతిలో సిరీస్ ఓడిపోయింది. అంతేకాకుండా మూడేళ్ల తర్వాత ఓ ద్వైపాక్షిక టీ20 సిరీస్‌లో ఓటమి నమోదు చేసింది. దీంతో టీమిండియాపై నెట్టింట దారుణంగా ట్రోల్స్ వస్తున్నాయి. హెడ్‌కోచ్‌గా గౌతమ్ గంభీర్ నియమితుడయ్యాక టీమిండియా.. టెస్టుల్లో ఆశించిన మేర రాణించట్లేదు. దీంతో అతడిపై ట్రోల్స్ వస్తుంటాయి. అయితే వన్డేలు, టీ20ల్లో మాత్రం సత్తాచాటుతోంది. కానీ తాజాగా ఐర్లాండ్ చేతిలో ఓటమి తర్వాత.. గంభీర్ మరోసారి ట్రోలర్స్‌కు టార్గెట్ అయ్యాడు. కానీ ఇప్పుడు ఈ జాబితాలో ఐస్‌లాండ్ క్రికెట్ కూడా చేరిపోయింది. ఇప్పటి వరకు ఐసీసీ సభ్యదేశం కూడా కాని ఐస్‌లాండ్ క్రికెట్ అసోషియేషన్ కూడా తన సోషల్ మీడియాలో గంభీర్‌ను ట్రోల్ చేసింది. "మేం (ఐస్‌లాండ్ క్రికెట్) గౌతమ్ గంభీర్‌ను మా కోచింగ్ స్టాఫ్‌గా తీసుకోవాలని అనుకోవడం లేదు. ఒకరకంగా మారు ఇలా చేయడం ఇష్టం లేదు కూడా. గంభీర్‌లో అద్భుతమైన ప్రతిభ ఉంది. కానీ భారత ఆటగాళ్లను తీసుకొచ్చి.. ఐర్లాండ్‌లో ఇలాంటి ఫలితాలను అందించాలంటే అసాధారణమైన ప్రతిభ కావాలి. అది గౌతమ్ గంభీర్ వద్ద పుష్కలంగా ఉందనిపిస్తోంది" అని ఐస్‌లాండ్ క్రికెట్ తన అధికారిక సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేసింది. మరోవైపు పసికూన ఐర్లాండ్ చేతిలో రెండు టీ20ల సిరీస్‌ను టీమిండియా కోల్పోవడం పట్ల మాజీల నుంచి తీవ్ర విమర్శలు వస్తున్నాయి. చిన్న జట్టు అనే ఉదాసీనతే భారత జట్టు ఓటమికి కారణమనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఐర్లాండ్‌ను లైట్ తీసుకోవడం వల్లే.. చరిత్రలోనే అతి భయంకరమైన ఓటమి ఎదురైందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా బ్యాటర్ల షాట్ల ఎంపిక దారుణంగా ఉందని విమర్శలు సైతం వస్తున్నాయి. టాప్ ఆర్డర్ వైఫల్యం కూడా టీమిండియా కొంపముంచింది.

## ఒలింపిక్స్ బరిలో టీమిండియా..

ఆసియా నుంచి ఏకైక జట్టుగా రికార్డు..!




మహిళల పొట్టి ప్రపంచకప్- 2026 నుంచి లీగ్ దశలోనే నిష్క్రమించిన భారత జట్టు కు ఓ తీపికబురు. మెగా టోర్నీలో సెమీస్ చేరలేకపోయిన టీమిండియా 2028 ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. లాస్ ఏంజెల్స్‌లో జరుగునున్న విశ్వ క్రీడల్లో భారత్ బెర్తు దక్కించుకుందని సోమవారం అంతర్జాతీయ క్రికెట్ మండలి వెల్లడించింది. ఆసియా జట్లలో ఒకటైన భారత్ టీ20 వరల్డ్‌కప్‌లో అత్యధిక పాయింట్లతో ఒలింపిక్స్‌కు క్వాలిఫై అయిందని ఐసీసీ తెలిపింది. ఒలింపిక్స్‌లో క్రికెట్ అనే పదం వినిపించి వందల ఏళ్లు గడిచిపోయాయి. 128 ఏళ్ల విరామం తర్వాత లాస్‌ఏంజెల్స్‌లో మళ్లీ క్రికెట్ పోటీలకు తెరలేవనుంది. మెగా టోర్నీకి మరో రెండేళ్లే ఉండడంలో జట్ల ఎంపికపై దృష్టి సారించింది ఐసీసీ. ఈ క్రమంలోనే ఒక్కో ఖండం నుంచి ఒక్కో జట్టును విశ్వ క్రీడలకు తీసుకుంటోంది. మహిళల టీ20 వరల్డ్‌కప్‌లో సెమీస్ బెర్తు చేజార్చుకున్నప్పటికీ.. ఆసియా నుంచి అత్యధిక పాయింట్లతో భారత జట్టు ఎంపికైంది. ఎంపిక ప్రక్రియ ఇలా
ఆసియా ఖండం నుంచి టీమిండియా క్వాలిఫై కాగా.. ఓసియన్ నుంచి ఆస్ట్రేలియా, ఆఫ్రికా ఖండం నుంచి దక్షిణాఫ్రికా, యూరప్ నుంచి ఇంగ్లండ్ ఒలింపిక్స్ బెర్తు సొంతం చేసుకున్నాయి. తద్వారా లాస్‌ఏంజెల్స్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన మొదటి నాలుగు మహిళల జట్లుగా నిలిచాయి. 2028 విశ్వక్రీడలకు ఆతిథ్యమిస్తున్న అమెరికా ఐసీసీ మహిళల టీ20 ర్యాంకింగ్స్ ఆధారంగా ఐదో జట్టుగా ఎంపికయ్యే అవకాశముంది. షరతు ఏంటంటే.. ఈ ఏడాది జూన్ 30 నుంచి డిసెంబర్ 31 మధ్య యూఎస్ఏ టాప్-15లో ఉండాలి. ఒకవేళ అమెరికా విఫలమైతే.. 2027 మార్చి 1 నాటికి ఐసీసీ మహిళల టీ20 ర్యాంకింగ్స్‌లో ఉండని జట్టు.. ఐదో స్థానం దక్కించుకుంది. చివరి బెర్తును ఐసీసీ ఒలింపిక్ క్వాలిఫయర్ 2027 ద్వారా నిర్ణయించనున్నారు.

## వైజాగ్ వేదికగా నేడు
# లెనిన్ ట్రైలర్ విడుదల




అక్కినేని అఖిల్ అభిమానులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న మాస్ కంబ్యాక్ మూవీ 'లెనిన్' ఇప్పుడు ప్రమోషన్స్‌లో వేగం పెంచింది. దర్శకుడు మురళీ కిషోర్ అబ్బూరు తెరకెక్కిస్తున్న ఈ మాస్ యాక్షన్ డ్రామాపై ఇప్పటికే మంచి అంచనాలు నెలకొనగా, తాజాగా ట్రైలర్ లాంచ్‌కు సంబంధించిన అప్‌డేట్ సినిమాపై మరింత హైప్‌ను పెంచుతోంది. చిత్ర బృందం 'లెనిన్' థియేట్రికల్ ట్రైలర్‌ను జూన్ 30న విశాఖపట్నంలో గ్రాండ్‌గా విడుదల చేయాలని నిర్ణయించింది. సాయంత్రం 4 గంటలకు నగరంలోని ప్రముఖ శరత్ థియేటర్‌లో ఈ ఈవెంట్ జరగనుంది. ట్రైలర్ లాంచ్ కోసం ఇప్పటికే భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. అఖిల్ అభిమానులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమానికి హాజరయ్యే అవకాశం కనిపిస్తోంది. ఈ సందర్భంగా విడుదల చేసిన కొత్త పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పోస్టర్‌లో అఖిల్ పూర్తిస్థాయి రస్టిక్ లుక్‌లో సైకిల్ తొక్కుతూ కనిపించడం అభిమానులను ఆకట్టుకుంటోంది. 'ఏజెంట్' తర్వాత అఖిల్ నుంచి వస్తున్న ఈ సినిమా ఆయన కెరీర్‌కు కీలకంగా మారనుంది. చాలా కాలంగా సరైన హిట్ కోసం ఎదురుచూస్తున్న అఖిల్, ఈసారి పూర్తిస్థాయి మాస్ యాక్షన్ కథను ఎంచుకోవడం విశేషం. ఈ చిత్రంలో అఖిల్ సరసన యువ నటి భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తోంది. వీరిద్దరి కెమిస్ట్రీ కూడా సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని చిత్ర యూనిట్ చెబుతోంది. ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న ఈ సినిమాను అన్నపూర్ణ స్టూడియోస్, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, మనం ఎంటర్‌ప్రైజెస్ బ్యానర్లపై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. భారీ నిర్మాణ విలువలతో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి సంగీత దర్శకుడు ఎస్. థమన్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, పాటలపై మంచి అంచనాలు నెలకొన్నాయి. జూలై 10న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానున్న 'లెనిన్' చిత్రం అఖిల్ కెరీర్‌లో అత్యంత కీలకమైన సినిమాగా భావిస్తున్నారు.

# ఇరుముడి కట్టు'తో భక్తి సంద్రంలో రవితేజ..
## ఫస్ట్ సాంగ్‌కు అద్భుతమైన స్పందన





మాస్ మహారాజా రవితేజ హీరోగా దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కిస్తున్న డివోషనల్ థ్రిల్లర్ 'ఇరుముడి' సినిమాపై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ సినిమా నుంచి విడుదలైన తొలి పాట 'ఇరుముడి కట్టు' ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. అయ్యప్ప స్వామి భక్తి నేపథ్యంలో రూపొందిన ఈ గీతం భక్తి భావాలను మళ్లీ మళ్లీ గుర్తు చేసేలా ఉండటంతో సోషల్ మీడియాలో మంచి స్పందనను సొంతం చేసుకుంది. సోమవారం (జూన్ 29) చిత్ర బృందం విడుదల చేసిన ఈ లిరికల్ వీడియోలో రవితేజ భక్తి పారవశ్యంలో మునిగిపోయిన తీరు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 'స్వామియే శరణం అయ్యప్ప' అంటూ ప్రారంభమయ్యే ఈ పాట, చివరి వరకు భక్తి రసాన్ని కొనసాగిస్తూ శ్రోతలను అలరిస్తోంది.పాటలో అయ్యప్ప మాలధారణలో కనిపించిన రవితేజ, భక్తి భావాలతో నిండిన స్టెప్పులు వేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఆయన లుక్, ఎక్స్‌ప్రెషన్స్, పాట చిత్రీకరణకు సంబంధించిన విజువల్స్ సినిమాపై మరింత ఆసక్తిని పెంచాయి. విడుదలైన కొద్ది గంటల్లోనే ఈ పాట సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ చిత్రానికి ప్రముఖ సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే సినిమాలో రెండు అయ్యప్ప స్వామి భక్తి గీతాలు ఉంటాయని ఆయన వెల్లడించారు. అందులో భాగంగా విడుదలైన తొలి పాటకు సంగీతం, ఆర్కెస్ట్రేషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ గీతాన్ని గాయకుడు అనంతు తన స్వరంతో అద్భుతంగా ఆలపించారు. పాట సాహిత్యాన్ని దర్శకుడు శివ నిర్వాణ, రచయిత కళ్యాణ్ చక్రవర్తితో కలిసి రాయడం విశేషం. దర్శకుడిగానే కాకుండా మంచి సాహిత్యకారుడిగా కూడా శివ నిర్వాణ మరోసారి తన ప్రతిభను చాటుకున్నారు. డివోషనల్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న 'ఇరుముడి' సినిమాలో భక్తి, భావోద్వేగాలు, థ్రిల్ అంశాలు సమపాళ్లలో ఉండనున్నాయని సమాచారం. ఫస్ట్ సాంగ్‌కు వస్తోన్న స్పందనను చూస్తుంటే సినిమా సంగీతం కూడా ప్రధాన ఆకర్షణగా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే 'ఇరుముడి కట్టు' పాట భక్తుల్లో ప్రత్యేక ఆదరణ పొందుతుండగా, రాబోయే రోజుల్లో సినిమా నుంచి వచ్చే ఇతర అప్‌డేట్స్‌పై కూడా అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# 'నో' చెప్పడం నేర్చుకోండి


ప్రతిభావంతులైన నటీనటులు రొటీన్ కథలకు 'నో' చెప్పడం నేర్చుకోవాలి' అంటున్నారు బాలీవుడ్ భామ కంగనా రనౌత్. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికరమైన విషయాలను ఆమె వెల్లడించారు. 'నా యాటిట్యూడ్ కొందరికి ఇబ్బందిగా ఉంటుంది. నిర్మొహమాటంగా మాట్లాడటం. నచ్చని దాన్ని 'నచ్చలేదు' అని ముఖం మీదే చెప్పడం చాలామందికి నచ్చదు. కానీ నా ఉద్దేశ్యంలో 'నో' చెప్పడం చేతకాని వాళ్లు జీవితాన్ని గెలవలేరు. ఈ కారణంగా మనం టార్గెట్ అయినా.. దక్కాల్సిన అవకాశాలు మనకు దక్కకపోయినా.. చివరికి మాత్రం నిజాయితీనే గెలుస్తుంది. సంఖ్య అనేది ఎప్పటికీ ముఖ్యం కాదు. క్వాలిటీనే ముఖ్యం. మనం చేసిన పాత్రలు కొన్నేళ్లపాటు గుర్తుంటే, మనం ఆటోమేటిగ్గా గుర్తుంటాం. నచ్చని కథల్ని దూరం పెట్టాను కాబట్టే, నేను రెగ్యులర్ హీరోయిన్ల లిస్ట్‌లో లేను. అందుకు బాధ లేదు. నాకంటూ జనాల్లో ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. అది చాలు' అన్నారు కంగనా. ప్రస్తుతం ఆమె 'క్వీన్ 2'లో నటిస్తున్న విషయం తెలిసిందే.

# బెల్లంకొండ సాయి శ్రీనివాస్ మూవీ అరుదైన రికార్డు



టాలీవుడ్ యంగ్ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ తన కెరీర్‌లో అరుదైన డిజిటల్ మైలురాయిని అందుకున్నారు. పలువురు స్టార్ హీరోలకు కూడా సాధ్యం కాని ఘనతను ఆయన సొంతం చేసుకుని సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారారు. దర్శకుడు బోయపాటి శ్రీను తెరకెక్కించిన 2017 యాక్షన్ ఎంటర్‌టైనర్ 'జయ జానకి నాయక' హిందీ డబ్బింగ్ వెర్షన్ యూట్యూబ్‌లో ఏకంగా 1 బిలియన్ (100 కోట్ల) వ్యూస్ సాధించి సంచలనం సృష్టించింది. 'ఖుంఖార్' పేరుతో ప్రముఖ యూట్యూబ్ ఛానెల్‌లో విడుదలైన ఈ చిత్రం సంవత్సరాలు గడిచినా ప్రేక్షకాదరణను ఏమాత్రం కోల్పోలేదు. నెమ్మదిగా వ్యూస్ పెంచుకుంటూ వచ్చిన ఈ సినిమా ఇప్పుడు వంద కోట్ల వ్యూస్ మార్క్‌ను దాటడం విశేషం. దీంతో భారతీయ సినీ చరిత్రలో ఈ అరుదైన ఘనత సాధించిన చిత్రాల జాబితాలో చోటు దక్కించుకుంది. ఈ రికార్డుతో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ పేరు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. యూట్యూబ్‌లో ఒక ఫుల్ లెంగ్త్ డబ్బింగ్ సినిమాకు 1 బిలియన్ వ్యూస్ సాధించిన తొలి తెలుగు హీరోగా ఆయన నిలిచారు. టాలీవుడ్‌కు చెందిన అనేక బ్లాక్‌బస్టర్ చిత్రాలు హిందీలో డబ్ అయ్యి యూట్యూబ్‌లో విడుదలైనప్పటికీ, ఒక్క సినిమాతో ఈ స్థాయి వ్యూస్‌ను అందుకోవడం ప్రత్యేకమైన విజయంగా చెప్పవచ్చు. ఈ సినిమాలో రకుల్ ప్రీత్ సింగ్ హీరోయిన్‌గా నటించగా, జగపతిబాబు, శరత్ కుమార్ కీలక పాత్రలు పోషించారు. థియేటర్లలో డీసెంట్ హిట్‌గా నిలిచిన ఈ చిత్రం, డిజిటల్ ఎ÷-లాట్‌ఫామ్‌లలో మాత్రం అసాధారణ ఆదరణను దక్కించుకుంది.

# ఇరుముడి కట్టు లిరికల్ వీడియో విడుదల




మాస్ మహారాజా రవితేజ హీరోగా దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కిస్తున్న డివోషనల్ థ్రిల్లర్ 'ఇరుముడి' సినిమాపై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ సినిమా నుంచి విడుదలైన తొలి పాట 'ఇరుముడి కట్టు' ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. అయ్యప్ప స్వామి భక్తి నేపథ్యంలో రూపొందిన ఈ గీతం భక్తి భావాలను మళ్లీ మళ్లీ గుర్తు చేసేలా ఉండటంతో సోషల్ మీడియాలో మంచి స్పందనను సొంతం చేసుకుంది. సోమవారం చిత్ర బృందం విడుదల చేసిన ఈ లిరికల్ వీడియోలో రవితేజ భక్తి పారవశ్యంలో మునిగిపోయిన తీరు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 'స్వామియే శరణం అయ్యప్ప' అంటూ ప్రారంభమయ్యే ఈ పాట, చివరి వరకు భక్తి రసాన్ని కొనసాగిస్తూ శ్రోతలను అలరిస్తోంది. పాటలో అయ్యప్ప మాలధారణలో కనిపించిన రవితేజ, భక్తి భావాలతో నిండిన స్టెప్పులు వేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఆయన లుక్, ఎక్స్‌ప్రెషన్స్, పాట చిత్రీకరణకు సంబంధించిన విజువల్స్ సినిమాపై మరింత ఆసక్తిని పెంచాయి. విడుదలైన కొద్ది గంటల్లోనే ఈ పాట సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ చిత్రానికి ప్రముఖ సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే సినిమాలో రెండు అయ్యప్ప స్వామి భక్తి గీతాలు ఉంటాయని ఆయన వెల్లడించారు. అందులో భాగంగా విడుదలైన తొలి పాటకు సంగీతం, ఆర్కెస్ట్రేషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ గీతాన్ని గాయకుడు అనంతు తన స్వరంతో అద్భుతంగా ఆలపించారు. పాట సాహిత్యాన్ని దర్శకుడు శివ నిర్వాణ, రచయిత కళ్యాణ్ చక్రవర్తితో కలిసి రాయడం విశేషం. 'ఇరుముడి' సినిమాలో భక్తి, భావోద్వేగాలు, థ్రిల్ అంశాలు సమపాళ్లలో ఉండనున్నాయని సమాచారం. ఫస్ట్ సాంగ్‌కు వస్తోన్న స్పందనను చూస్తుంటే సినిమా సంగీతం కూడా ప్రధాన ఆకర్షణగా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com